
భక్తిమాల
DEC 2010


1


2


3
NADA MANTAPAM

# భక్తిమాల

## తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక

పుష్పగుచ్ఛం 33 డిసెంబర్ 2010 పుష్పం 12






ద్వారాణి దుఃఖస్య సుఖస్య చాపి
భవంతి నానం మన ఇంద్రియాణి
యతో భవాన్ తద్యుగళాతివర్తీ
భూమా తతస్త్వాం గురుదత్తమీడే॥

(శ్రీదత్త ధ్యానమాలిక)

గురుదత్త దేవా! లోకంలో సుఖాన్నీ దుఃఖాన్నీ, అందించే ద్వారాలు మనస్సు, ఇంద్రియాలు మాత్రమే. నువ్వు ఆ జంటలు రెంటినీ (ఇంద్రియ మనస్సులను, సుఖదుఃఖాలను) దాటిపోయినవాడివి. అందుకే నీవు (ఛాందోగ్యోపనిషత్తులో ప్రతిపాదింప బడిన) భూమస్వరూపుడవు. అట్టి నిన్ను స్తుతిస్తున్నాను.


సంస్థాపకులు
శ్రీదత్తపీఠాధిపతి
శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ


ముక్తికన్యా వివాహేచ్ఛా
యద్యస్తి తవమానసే।
ఆత్మాలంకరణార్థాయ
భక్తిమాలాం గలే భర॥

తాత్పర్యం

ముక్తికన్య నిన్ను వరించాలంటే భక్తిమాలతో నిన్ను అలంకరించుకో.


సంపాదకులు
శ్రీకుప్పావేంకట కృష్ణమూర్తి

# భక్తిమాల

**శ్రీభక్తిమాల ట్రస్టు (రి),**

**శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము**


దత్తనగర్, మైసూరు - 570 025,

ఫోను: 0821-2486486 ఫ్యాక్స్ : 0821-2487487.

వెబ్‌సైట్ : http://dattapeetham.com.Email:mail@dattapeetham.com

**Bhaktimala Email :**

**subscription_bhaktimala@dattapeetham.com:** For Informaiton regarding Subcription, effecting change of your mailing address etc.


## ఈ సంచికలో..........


| | |
|---|---|
| శ్రీ దత్త ధ్యానమాలిక | 01 |
| అమృతబిందువు | 03 |
| సూక్తిమంజరి | 04 |
| పిల్లలూ! ఇది మీకు తెలుసా? | 10 |
| శంకర చరితము | 14 |
| శ్రీస్వామీజీ చరిత్ర | 17 |
| దత్తపదీయం - 45 | 20 |
| శ్రీస్వామీజీ వారి భారతసూక్తులు | 23 |
| శ్రీస్వామీజీ వారి పర్యటనా విశేషాలు | 28 |
| మైసూరు ఆశ్రమంలో జరిగిన ముఖ్య కార్యక్రమాలు | 33 |
| ఆశ్రమశాఖలలో జరిగిన విశేష కార్యక్రమములు | 35 |
| అనుభవాలు | 37 |
| పురాతన భారతీయ విజ్ఞానశాస్త్ర శాఖలు | 40 |
| I- Serve వారి నివేదిక | 42 |
| స్వామీజీ పర్యటనా పత్రిక | 46 |
| ఎస్.జి.ఎస్ దత్తసేవ | 47 |


## ఫోటోల వివరాలు

**ముఖచిత్రం:** అతిరుద్రయాగమున స్థాపించిన ఏకాదశ కలశములకు పూజా, ప్రార్థనలు సమర్పిస్తున్న శ్రీస్వామీజీ.

**వెనుక అట్టపై:** పరమపూజ్య శ్రీస్వామీజీ వారు ది.5-11-2010 నాటికి అవతారము దాల్చి 25000 రోజులు పూర్తి అయిన సందర్భమున దత్తకుటుంబ సభ్యుల భక్తిపూర్వక శుభాకాంక్షల జ్ఞాపికతో శ్రీస్వామీజీ.

1) అతిరుద్ర యాగమున ద్వాదశ స్ఫటిక లింగములకు శ్రీస్వామీజీ క్షీరాభిషేకము గావిస్తున్న దృశ్యము.

2) అతిరుద్రయాగ మహాపూర్ణాహుతి యనంతరము ప్రార్థనలు చేస్తున్న శ్రీస్వామీజీ, వేదపండితుల బృందము, ప్రధాన సేవాకర్తలు.

(మిగతా వివరములు 46వ పేజీలో)


<u>సభ్యత్వం వివరములు</u> :-

2 సం॥లకు రూ॥150/-, 5 సం॥లకు రూ॥ 350/-

దాతలు రూ॥ 2000/ -, పోషకులు రూ॥ 5000/-

రాజ పోషకులు రూ॥10,000/-,

విదేశీయులకు 1సం॥కు - 25 U.S. Dollors,

జీవిత సభ్యత్వం - 350 U.S. Dollors

<u>ప్రకటన వివరములు</u> :-

స్వామీజీవారి ఫోటోతో పూర్తిపేజీ రూ॥ 5000/

స్వామీజీవారి ఫోటో లేకుండా పూర్తిపేజీ రూ॥ 4500/-

సగం పేజీ రూ॥ 2500/-

పావు పేజీ రూ॥ 1300/-

పెండ్లి మరియు ఇతర ఆశీస్సులకు రూ॥ 600

# జత ఉందు



కూడబెట్టిన సొమ్ము గృహమునందే వదలి
చెప్పకనే పయనించు ప్రాణిదెపుడు
కాటివరకే వత్తురు నెత్తురు బంధువులు
నీ వెంట పాపపుణ్యములు జత ఉందు
సచ్చిదానంద–

(స్వామీజీ వారి చిటికె సాహిత్యం నుండి)

"ఆశయా బధ్యతే లోకః" అన్నారు. ఈలోకం అంతా ఆశ అనే పాశంతో బంధించబడి ఉంది అని పెద్దలమాట. మానవజీవితంలో అన్నీ బంధాలే! మమకారాలే! ప్రాణమున్న వారి మీద ప్రేమ. ప్రాణంలేని ఇల్లు, పొలం, ధనం, మొదలగు వాటిమీద ఆశ. సంపాదించినది సరిపోక, ఇంకా సంపాదించాలనే తపన! ఇది ఒక పెద్ద విషవలయం. ఇందులోనే జీవితం తిరుగుతూ ఉంటుంది.

మూర్ఖుడు ధనాన్ని సంపాదిస్తాడు, జ్ఞాని కూడా ధనాన్ని సంపాదిస్తాడు. మూర్ఖుడు తాను సంపాదించిన ధనాన్ని ఇహలోక సుఖాలకు ఖర్చుచేసి, నిలువచేస్తూ ఉంటాడు. లోకజ్ఞుడైన సత్పురుషుడు తాను సంపాదించిన దానిని ధర్మమార్గంలో వినియోగిస్తూ, అందరి మన్ననలను పొందుతాడు. మనతో వచ్చేది మన యొక్క మంచిచెడు పనుల యొక్క ఫలితం మాత్రమే!

కోట్లాదికోట్ల రూపాయలు సంపాదించినా, వార్ధకదశలో మానవుడు తాను అనుభవించేది స్వల్పమే! సుఖాలు ఎన్ని ఉన్న అనుభవించలేడు. తాను సంపాదించినదంతా భార్యాపుత్రులు, బంధువులు తీసికొనిపోతారు. ఆఖరి ప్రయాణంలో చివరకు శ్మశానం వరకు రావడానికి కూడా సంకోచిస్తారు.

కాబట్టి మానవునికి ఎల్లవేళల జతగ ఉండేది పాపపుణ్యఫలాలు మాత్రమే! పాపఫలం, పుణ్యఫలం నీతోనే వస్తుంది. సంపాదించిన ధనాన్ని దానధర్మాలకు ఉపయోగించి పుణ్యాన్ని మూటగట్టుకో! నీవు చేసిన పుణ్యమే నీకు ఎల్లప్పుడు జతగ ఉంటుంది. జయగురుదత్త.




# కలిమిలేముల తెలివి

**యథా మృతస్తథా జీవన్**

**యథా సతి తథాఽసతి।**

**యస్యైష బుద్ధిలాభ స్స్యాత్**

**పరితప్యేత కేన సః॥**(రామాయణ సూక్తి)

(చనిపోయిన తరువాత శరీరేంద్రియాదులతో సంబంధం లేకుండా తను ఎలా వుండబోతున్నాడో, అలాగే బ్రతికి వున్న రోజుల్లో గూడా వుండ గలగాలి. కలిగిన రోజుల్లో ఎలా వున్నాడో, లేని రోజుల్లో గూడా అలాగే వుండ గలగాలి. ఇలాంటి తెలివిని ఎవడు సంపాదించుకున్నాడో, వాడికి ఇక దుఃఖం ఎలా వస్తుంది?)

ప్రతివాడికీ ఏదో ఒక దశలో, ఏదో ఒక కారణంవల్ల, కష్టాలు వచ్చి మీద పడుతున్నాయి. దీనికి ఎక్కడైనా మినహాయింపులున్నాయేమో నని, అటు మహారాజుల చరిత్రలు చూసినా, ఇటు యోగీశ్వరుల చరిత్రలు చూసినా, చివరికి అవతార పురుషుల చరిత్రలు చూసినా గూడా, ఎక్కడా మినహాయింపు కనిపించటం లేదు. ఐతే, మానవజాతి పురాతన చరిత్రను వివిధ కోణాల్లో పరిశీలించి, పూర్వ గాథలను పోగులు బెట్టిన పురాణాల్లోకి వెళ్ళి చూస్తే, జనకుడు, నలుడు వంటి రాజులు, వశిష్ఠుడు, గౌతముడు వంటి యోగులు, విష్ణుదత్తుడు, కుచేలుడు వంటి పండితులు, ఇలాంటివారు కొంతమంది కష్ట సమయాల్లో గూడా ఉల్లాసంగా జీవనం చేసినట్లు కనిపిస్తోంది. వాళ్ళకీ పరాజయాలు, కష్టాలు, తప్పలేదు. ఐతే అలాంటి సమయాల్లో వాళ్ళు కుంగిపోలేదు, కూలిపోలేదు, పాలిపోలేదు. పైగా నిలకడగా, నిబ్బరంగా, నిర్మలంగా వుండగలిగారు. ఇదెలా సాధ్యం?!

అసలిలాంటి కథలన్నీ చరిత్రలేనా? లేక పుక్కిటి పురాణాలా?–అని సందేహిద్దామంటే, ఇటీవలి కాలంలో గాంధీజీ వంటి రాజకీయ నాయకులు, కంచి పరమాచార్యుల వంటి యోగులు, కావ్యకంఠ గణపతిముని వంటి పండితులు, అలాంటి జీవితాలను జీవించి చూపించారు. దీనికి ప్రత్యక్ష సాక్షులు ఇప్పటికీ ఉన్నారు. అందువల్ల అలనాటి కథలు అసంభవాలనటానికి వీలు లేదు.

అవి అసంభవాలు కాకపోతే, అలాంటి స్థితి మనకెందుకు రావటం లేదు? చిన్ని కష్టం రాగానే మనస్సంతా వికలమైపోయి, ఉన్న తెలివి గూడా అడుగంటిపోయి, ధైర్యం చెదిరిపోయి, బోరుమని యేదుస్తున్నామెందుకు? దాతల సహాయాల కోసం, మంత్రగాళ్ల తాయత్తుల కోసం, పక్కవాళ్ళ ఓదార్పుల కోసం, అంగలారుస్తున్నామెందుకు?

ఇది అర్థం కావాలంటే, మనకు కష్టాలువచ్చే ప్రక్రియ యేమిటో కొంచెం గమనించుకోవాలి.

కష్టాలు రకరకాలు. నిజమే. కానీ అవి మనకు అంటే మార్గాలు ఆరే! అవే షడింద్రియాలు. వాటినే పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు , అంటారు. వీటిని మించి దుఃఖం మనకు అంటే మార్గం వుందా?– కొంచెం ఆలోచించండి. ఈ ఆలోచన ముందుకు సాగాలంటే "మనం" ఎవరు? ఈ "ఇంద్రియా"లనేవి ఎవరు?– అనేది స్పష్టంగా అర్థమైతే మేలు. అది అంత పూర్తిగా అర్థం కాకపోయినా, "మనం" అంటే, మనలో అంతర్గతమై, మనలో నఖశిఖ పర్యంతం వ్యాపించి వున్న చైతన్యమేననీ, ఈ ఇంద్రియాలూ, మనస్సు, ఆ చైతన్య ప్రభావంవల్ల పరుగులు తీసే మోటారు బళ్ళవంటి జడ పదార్థాలనీ – అర్థమైనా చాలు.

ఇలాంటి అవగాహన కలిగితే, ఆ మనిషికి అఖండమైన ధైర్యం లభిస్తుంది.

పులి మీదికి మొండిగా దూక గలగటం ధైర్యం కాదు. పులితోటి పోరాటంలో, తనకో కాలూ చేయీ పోయినా, మిగిలిన జీవితమంతా సంతోషంగా జీవించ గలగటం ధైర్యం!

ఒక వ్యాపారస్థుడికి కారు ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా తీసేయవలసి వచ్చిందట. ఆయన కోలుకొని, చంక కింద కర్ర పోటీ పెట్టుకొని, మళ్లీ వ్యాపారం

కోసం తిరగటం మొదలుపెట్టాడట. కొందరు మిత్రులు "అయ్యో! ఎంత కష్టం" అని ఓదార్చ బోయారట. ఆయన చిరునవ్వు నవ్వి "ఈ కష్టంలో ఒక లాభం కూడా ఉందండీ. నా చెప్పుల ఖర్చు సగం తగ్గింది కదా" అన్నాడట. అదీ ధైర్యం!

ధైర్యమనే పదానికి అసలైన అర్థం ధీరత్వం. ధీరత్వం అంటే ధీరుడిలో వుండే గుణం. వివేచనాజ్ఞానం కలవాడే ధీరుడు. తను ఏదో, తను కానిదేదో విడమరచి చూడ గలగటమే నిజమైన వివేచనాజ్ఞానం. మంచి చెడులను విడదీసి చూడగలగటం దీనికి పూర్వ రూపం. అందుచేత దాన్ని గూడా వివేచనాజ్ఞానం (లేక వివేకం) అని పిలుస్తూ వుంటారు.

ఇలాంటి వివేకాన్ని గురించే ఈ నెల సూక్తి ప్రస్తావిస్తోంది. ముస్ముందుగా ఈ సూక్తి జడ చేతన విభాగాన్ని గురించి ప్రస్తావిస్తోంది.

"యథామృత స్తథా జీవన్'' (మరణించిన తరువాత ఎలా వుండబోతున్నావో, అలాగే బ్రతికి వుండగా వుండు)– అంటోంది.

మరణించిన తరువాత జీవ చైతన్యం లోకాంతరాలకూ, దేహాంతరాలకూ తరలి పోతుంది. అప్పుడు ఇప్పటి ఈ శరీరంలోని ఇంద్రియాదుల జడత్వం విస్పష్టంగా అనుభవంలోకి వస్తుంది. ఈ విషయాన్ని మనం ఈ దేహంలో జీవించి వుండగానే అర్థం చేసుకో గలగాలి. దీనికోసం మృతదేహాలను పరిశీలించటం నేర్చుకోవాలి.

అంటే, పీనుగల వెంట పరుగెత్తాలా? అక్కర లేదు. మన పరిశీలన కోసం ఎవరో చావాలని ఎదురు చూడక్కరలేదు. మన పరిసరాల్లోనే చీమలు, దోమలు, ఈగలు, ఇలాంటి వెన్నో చచ్చి పడిపోతూనే వుంటాయి. చెట్లల్లో కొన్ని కొమ్మలు ఎండి రాలిపోతూ వుంటాయి. ఇవన్నీ ప్రాణం పోయిన శవాలే.

వీటిని పరిశీలిస్తే, వీటిల్లో చైతన్యం వుండగా ఇవి ఎలా వున్నాయి, చైతన్యం పోయినాక ఇవి ఎలా వున్నాయి– అనే విషయం అర్థమవుతుంది. దానివల్ల వాటి చైతన్యం వేరు, వాటి ఇంద్రియాలు వేరు – అని అర్థమవుతుంది. ఈ సత్యాన్ని మన సొంత శరీరానికి అన్వయించుకోవాలంటే మాత్రం కొంచెం ఎక్కువ కృషి చెయ్యాలి.

ఈ కృషి కొంచెం కష్టం అనుకునేవారికోసం ఈ సూక్తి మరో ఉపాయాన్ని సూచిస్తోంది– "యథా సతి తథా –సతి"(కలిమి లేముల్లో సమంగా వుండాలి)–అని.

కలిమి అంటే – కలిగి వుండటం. దేన్ని కలిగివుండటం? ఎవరికి ఏది కావాలో దాన్ని కలిగివుంటే – అది కలిమి.

ఈగలకు మలిన పదార్థమే కలిమి.

గేదెలకు ఎండిపోయిన గడ్డే కలిమి.

మరి మానవులకో? ఒకటి గాదు, వెయ్యి రకాల పదార్థాలు కలిస్తే గానీ కలిమి కాదు. అన్నిటినీ సమకూర్చ గలది డబ్బు గనుక, డబ్బు బాగా వుంటే – కలిమి వున్నట్లే అని మానవుడు అనాలోచితంగా అనేస్తాడు. బాగా డబ్బున్నవాడి దగ్గరకు వెళితే, తనకు లేనివీ, కావాలసినవీ, వందలగొద్దీ చెపుతాడు. అవన్నీ పేదవాళ్ల దగ్గర వున్నాయని అసూయ పడతాడు. దీనిని బట్టి, మానవ జీవితానికీ – కలిమికీ గల సంబంధం ఎంత దుర్బలమో మనం అర్థం చేసుకో గలగాలి.

మనం జీవించే సమకాలీన సమాజంలో వివిధ జీవన రీతులు గల వ్యక్తులను గమనిస్తే, ప్రతి వ్యక్తికీ కొన్ని అంశాలలో కలిమీ, కొన్ని అంశాలలో లేమీ, కనిపిస్తుంది. అంతే గాదు, ఒకడు తన కలిమిలో భాగమనుకొని తృప్తి పడుతున్న అంశాలు బొత్తిగా లేకుండానే మరొకడు హాయిగా జీవించేస్తున్నాడు. ఉదాహరణకు, పట్టణవాసులు కలలు గనే పక్కాయిళ్లు లేకుండానే గ్రామవాసులు గుడిసెల్లో ఉల్లాసంగా జీవిస్తున్నారు.

మరో విచిత్రమేమిటంటే, ఒకడి జీవితంలో వున్న కలిమి భాగం గూడా ఎల్ల వేళలా ఒకే తీరుగా వుండటం లేదు. ఐశ్వర్యంతో తులతూగే మహారాజు, యుద్ధాల మోజులో పడి గుడ్డ గుడారాల్లో రోజులకు రోజులు ఉల్లాసంగా గడిపేస్తున్నాడు. ధాన్యపు రాసుల్లో మునిగి వుండే రైతు, పట్టణంలో బియ్యపు మిల్లు కట్టి, దాని పోషణలో నిద్రాహారాలు మాని సంతోష పడిపోతున్నాడు.

ఇవన్నీ కలిమి భాగంలో కోరి తెచ్చుకున్న లేములు. ఇవి గాక, వద్దన్న కొద్దీ వచ్చి నెత్తిమీద పడే లేమి భాగాలు ఎలాగూ తప్పవు.

ఇలాగే, లేమి భాగంలో గూడా హెచ్చు తగ్గులు అనివార్యాలే.

ఇలా ప్రతి జీవితంలోనూ కలిమి లేములు కలగా పులగాలై, ఉయ్యాల ఊపులై, అలల గంతులై, పరుగులు తీస్తూ వుంటే, "ఇందులో కలిమి భాగాన్ని మాత్రమే కౌగలించుకొని శిలా ప్రతిమ లాగా వుండిపోతాను, లేమి భాగాన్ని ముట్టుకోనే ముట్టుకోను" అంటే, అందులో ఏమి తెలివి వుంది? ఏమి సాధ్యత వుంది?

ఈ విషయాన్ని అర్థం చేసుకోగల తెలివి వుంటే (బుద్ధి లాభస్స్యాత్), కలిమి లేముల గురించి అంగలార్చే దీనత్వం అంటమన్నా అంటదు.

అంతే కాదు, కలిమి లేముల నిత్య ప్రవాహ శీలతను ఇలా అనుసంధానం చేసుకోవటం ప్రారంభిస్తే, కలిమికీ– తనకు, లేమికీ– తనకు, గల సంబంధమేమిటన్న ప్రశ్న పుట్టి తీరుతుంది.

కలిమి– అంటే కావలసిన వస్తువు అని చెప్పుకున్నాం. కాగా లేమి అంటే– లేని వస్తువు– అని తేలుతోంది.

వీటిలో "కావలసిన వస్తువు" అనబడేది పంచ జ్ఞానేంద్రియాలలో ఏదో ఒక దాని ద్వారా మనకు అంటుకుంటోంది. కానీ, లేమి అనబడే లేని వస్తువు మనకు అంటుకొనేందుకు మార్గం ఏమి వుంది? ఏ మార్గమూ లేకపోయినా అంటగట్ట గల దిట్ట మనస్సు. అదే లేమిని (లేని పదార్థాన్ని) మనకు అంటగడుతోంది. కాగా, పంచ జ్ఞానేంద్రియాలు, మనస్సు కలిసి, కలిమి లేముల్ని మనకు అంటగడుతున్నాయని తేలింది.

ఇంద్రియాలకూ, మనస్సుకు, మనకు మధ్య గల సంబంధం గురించి ఇప్పుడే చర్చించుకొని వున్నాం. ఆ చర్చను కలిమి లేముల చర్చకు జోడిస్తే, ఆ కలిమి లేములకు మనను ప్రభావితులను చేయగల శక్తి ఇక మిగలదు.

అలాంటి స్థితికి చేరుకున్న వ్యక్తికి ఇక దుఃఖంతో సంబంధం పెట్టుకోవటానికి మార్గమే మిగిలివుండదు. అందుకే యీ సూక్తి చివరి పాదంలో "పరితప్యేత కేన సః" (అలాంటివాడు ఇక ఏ మార్గంచేత దుఃఖాన్ని పొందగలడు)– అన్నారు.

ఇక్కడ రెండు ఉపాయాల ప్రసక్తి వచ్చింది. ఒకటి కలిమి లేముల సమతా సాధనోపాయం. మరొకటి జడచేతన విభాగోపాయం. ఇవి రెండూ పరస్పర పరిపోషకాలు. దేని ద్వారా దేని కొసను కొంచెం అందుకున్నా అదీ ఇదీ కలిసిపోయి, ఒక దానిని ఒకటి వృద్ధి చేసుకుంటాయి. ఇలాంటి ఉపాయాన్ని కనిపెట్టి, పొదిగిపట్టుకున్నారు గనుకనే పురాణాలలో ప్రస్తావించిన జనకాదులంతా ఇక్కడే, ఈ శరీరంలోనే, జీవించి వుండగానే, కష్ట సుఖాలకు అతీతమైన శాశ్వత తత్త్వాన్ని అందుకొని జీవన్ముక్తులయ్యారు; నిశ్చలానంద స్వరూపులయ్యారు- అని ఈ సూక్తి మనకు నిరూపిస్తోంది.

పరగురుదత్త కృపాబలంవల్ల ఈ సూక్తి సారం సంసార దశలోనూ, సాధక దశలోనూ, సిద్ధ దశలోనూ గూడా మీ కందరికీ అనుభవ సిద్ధమై అలరారుగాక. జయగురుదత్త


**అమ్మఒడిని ఆదరిద్దాం**

పసితనంలో భగవంతుడిచ్చిన ఆసరా అమ్మఒడి !

వార్ధక్యంలో పూజ్య గురుదేవులు ప్రసాదించిన ఆలంబనే - అమ్మఒడి!

వార్ధక్యం ఓ శాపం అనేభావన తప్పు. వేదమాత దృష్టిలో వార్ధక్యమే అభివృద్ధి.

ఈ అనుభూతి నిరాధార మహిళా వృద్ధులందరికీ అందాలనే అనుగ్రహంతో గురుదేవులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ హైదరాబాదులో స్థాపించిన వృద్ధాశ్రమమే అమ్మఒడి !

ఈ అమ్మఒడిని మనమంతా ఆదరిద్దాం ! దీనికోసం మనం మన ఇళ్ళలో జరిగే రకరకాల కార్యక్రమాల సందర్భంగా రూ.2000- అమ్మఒడికి విరాళంగా అందిద్దాం ! మన పేరుతో నిర్దేశించిన రోజున దత్తపీఠంలో పూజ జరుగుతుంది. ప్రసాదం మనఇంటికి వస్తుంది. వీలుంటే మనం 5 మంది దాకా ఆరోజున అమ్మఒడికి వెళ్ళి అన్నప్రసాదం స్వీకరించవచ్చు.

మీరు బ్యాంకు డి.డి.లను ఎస్.జి.ఎస్.అవధూత దత్తపీఠం ట్రస్టు (ఆర్) పేరుతో హైదరాబాదులో చెల్లేలాగా తీసుకొని పోస్టులో పంపవచ్చు.

(ఫోన్ - 08418 - 255123, 040 - 27765047) అడ్రసు: అమ్మఒడి, ఎస్.జి.ఎస్.అవధూత దత్తపీఠం, ఎర్ ఫోర్స్ అకాడమీ రోడ్, దుండిగల్, హైదరాబాదు- 500 043.

పిల్లలూ, మీకు

# కచుడు

మీకు తెలుసా?



(జరిగిన కథ– యువతీయువకుల విచ్చలవిడి ప్రవర్తనలవల్ల వచ్చే అనర్థాలను గ్రహించేందు కోసం కచదేవయానుల కథ చెప్పుకుంటున్నాం. రాక్షస యువకులు కచుణ్ణి రెండుసార్లు హత్య చేశారు. రెండుసార్లూ దేవయాని బలవంతంవల్ల శుక్రాచార్యుడు అతన్ని బ్రతికించాడు. ఈ మాటు కార్తీకమాసంలో వెన్నెల సంబరాల సందట్లో దేవయాని మునిగివున్న సమయంలో కచుడు మళ్ళీ మాయమయ్యాడు. దేవయాని ఏడుస్తూ తండ్రి దగ్గరకు వెళ్ళింది. శుక్రాచార్యుడు ధ్యానదృష్టితో చూడటం మొదలుపెట్టాడు. ఇక చదవండి....)

దేవయాని ఆదుర్దాగా తండ్రి ముఖం వంకే చూస్తోంది. ఆ మొహంలో ఎక్కడా కాంతి రేఖలే కనిపించటం లేదు. మొహం రాను రాను ముడుచుకు పోతోంది. ఆ కనుబొమ్మలు ముళ్ళు ముళ్ళుగా మెలికలు తిరుగుతున్నాయి. ఆ కనురెప్పలు నీటి బిందువుల బరువును మోయలేక, కిందికి తోసేస్తున్నాయి. ఆయన పెదవులు ఏడుపును దిగమింగుకునే ప్రయత్నంలో మునిపళ్ళ సహాయం కోరుతున్నాయి. ఇదంతా గమనిస్తున్న దేవయానికి గుండె పగిలినంత పనైంది. "ఏమైంది నాన్నగారూ?" అంటూ ఆయన మీద పడి గోల గోలగా ఏడ్చేసింది.

ఆయన కళ్ళు తెరిచాడు. కూతుర్ని ప్రేమగా ఒదిగి పట్టుకున్నాడు. మాటల కోసం వెతుక్కుంటూ, "వాడు నా కడుపులోనే వున్నాడమ్మా" అన్నాడు జీవచ్ఛవం లాగా.

దేవయాని ఉలిక్కి పడింది. "అదేమిటి నాన్నగారూ! అది ఎలా జరిగింది?" అని ఒక పొలికేక పెట్టి, బావురుమని ఏడవడం మొదలు పెట్టింది. శుక్రాచార్యుడు కూతురి ఏడుపును భరించలేక మెల్లిగా ఏదో నసుగుతున్నాడు.

"తల్లీ! ఏం చేసేది? ఏం చెప్పేది? నా శిష్యుల ఆగడాలు నా ప్రాణాలమీదకే తెచ్చాయి. వాళ్ళు కచుణ్ణి చంపి, తగలబెట్టి, బూడిద చేసి, ఆ బూడిదను పానీయంలో కలిపి, నాకే ఇచ్చి నా చేత తాగించేశారు. సంబరాల సందట్లో వళ్ళు మర్చిపోయి నేను పీకల దాకా తాగేశాను. వాడిప్పుడు నా కడుపులోనే వున్నాడు. వాణ్ణి నేను ఇప్పుడు నా మృత సంజీవినీ విద్యతో బ్రతికిస్తే నేను మరణించటం ఖాయం. నేను కావాలో, వాడు కావాలో నువ్వే తేల్చుకో" అనేశాడు శుక్రాచార్యుడు నిర్లిప్తంగా.

దేవయానికి ఈ మాటలేవీ పట్టినట్లుగా లేదు.

"నాన్నగారూ! మీరు తలచుకుంటే ఏమైనా చేయగలరు. మీరు ఎలాగైనా సరే కచుణ్ణి బతికించాల్సిందే. లేకపోతే, నేనిప్పుడే మీ ఎదుటే ఉరేసుకు చచ్చిపోతా!" అని గగ్గోలు పెట్టసాగింది.

శుక్రాచార్యుడికి ఆ మాట వినేసరికి గుండె చెదిరిపోయింది. ఆయన కూతుర్ని బతిమాలుతూ "అంత మాట అనకు తల్లీ! ఈ రాక్షస శిష్యులకన్నా ఆ దేవతా శిష్యుడే నయమనుకుంటాను. వాడు

దయతలిస్తే నేను బతుకుతాను." అంటూనే కళ్ళుమూసుకుని మృతసంజీవినీ మంత్రం జపించాడు. క్షణాల్లో శుక్రాచార్యుడి కడుపు లోపలి అణువులలో కొత్త కదలిక ఏదో మొదలైంది. ఆ బాధకు తట్టుకోలేక ఆయన కొద్దిగా మెలికలు తిరుగుతున్నాడు.

ఈ వింత సన్నివేశానికి బిత్తరబోయిన దేవయాని ఒకసారి తల విదుల్చుకొని, పద్మాసనంలో నిటారుగా కుర్చుని, తన నాడీమండలాన్ని బిగపట్టి, తన ప్రాణశక్తి ప్రవాహాన్ని తండ్రికి సహాయంగా ఆయన నాభీకేంద్రానికి ప్రసారం చేయటం మొదలు పెట్టింది. ఆ ఏకాగ్రతా స్థితిలో ఆమె అంతఃకరణాలకు ఏవేవో సంభాషణలు గంభీరంగా వినిపిస్తున్నాయి. ఆమె నిలువెల్లా నిక్కపొడుచుకుంటూ, బుద్ధిని మరింత ఏకాగ్రం చేసుకుంటూ, ఆకాశవీధిలో సాగే ఆ సంభాషణలోని ప్రతి అక్షరాన్నీ పదిలంగా పొదిగి పట్టుకుంటోంది. ఆ సంభాషణ ఇలా సాగుతోంది–

**శుక్రాచార్యుడు:** వత్సా! కచ కుమారా! ఎక్కడున్నావురా?

**కచుడు:** గురుదేవా! ఇక్కడే వున్నాను. శరీరం బూడిదైపోయింది. అయినా నేను నేనుగానే వున్నాను. అహో, మళ్లీ ఏదో జౌతోంది. నా చుట్టూ ఏదో దేహం అల్లుకుంటోంది. పూర్వపు ఆకారంవంటి ఆకారం మళ్లీ ఏర్పడుతోంది.

**శుక్రాచార్యుడు:** వత్సా! ఈ గర్భభారం మొయ్యటం కష్టంగా వుంది. నా పొట్ట చీల్చుకొని నువ్వు బయటకు వచ్చేసెయ్యి.

**కచుడు:** గురుదేవా! నాకిది తగదు. కడుపులో పడ్డ ఆహారాన్ని జీర్ణం చేసుకునే హక్కు ప్రతి జీవికీ వుంది. మీరు నన్ను జీర్ణం చేసేసుకోండి.

**శుక్రాచార్యుడు:** అది నావల్ల కాదురా! నేను నీకు కన్న తండ్రిని కాకపోయినా, అక్షరంముక్క నేర్పకపోయినా, నీకు గురువునని చెప్పుకొని విర్రవీగిన ముసలి వెధవను రా! నిన్నెలా నమిలి మింగేది? అది అసంభవం. నాకు ఒక్కటే మార్గం మిగిలింది. మృత సంజీవినీ విద్యను నీకు ఉపదేశిస్తాను. దాన్ని జాగ్రత్తగా హృదయంలో ధరించు. నా కడుపు చీల్చుకొని బైటకు రా. నేనెలాగూ చచ్చిపోతాను. నీకు దయ వుంటే, నేను రాక్షస గురువుననే ద్వేషం లేకుండా వుంటే, నీ మంత్ర ప్రభావంతో నన్ను బతికించు. ఇదే నా కోరిక.

**కచుడు:** గురుదేవా! ఒకే ఒకసారి విన్నంత మాత్రాన, నా మంత్రం ఫలిస్తుందా? ఒకవేళ ఇటూ అటూ ఐతే నా గతేమిటి?

**శుక్రాచార్యుడు:** నాకా భయం లేదు. నువ్వు నా కంటే పవిత్రుడివి. అనలైన కర్పూరపు కొండవి. ఏ ఉపదేశమూ లేకుండానే దేహరహితమైన ఆత్మస్థితిని గుర్తించిన ధీరుడివి. నా మంత్ర శబ్దం నీ చెవికి సోకినాక ఇక ఆ కర్పూరం అంటుకోక మానదు. ఆ మంత్ర జ్వాలలను ఆపటం ఎవరి తరమూ కాదు. ఇంక ఆలస్యం వద్దు. నేనీ గర్భభారం భరించలేను. నాకు స్పృహ తప్పిపోక ముందే నేను పంపే మంత్ర తరంగాలను పొదిగి పట్టుకో.

ఇంతవరకూ వింటున్న దేవయానికి ఏదో అయోమయం కమ్మినట్టయిపోయింది. ఆ మంత్ర తరంగాలను తను గూడా ఒడిసిపట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్న ఆ కన్యా జీవికి అయోమయపు మత్తు వదిలేసరికి మళ్లీ ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయి. అది తన తండ్రి గొంతు. (సశేషం)



# శంకరచరితం
# గౌడపాదాచార్యులు

-- రాణీ --

గౌడపాదులు దక్షిణ భారతదేశ నివాసి. తన జీవితంలో ఏదో గొప్ప పనిచేయాలని, అందరి మన్నలను పొందాలని అతని కోరిక. బాల్యావస్థలోనే అనేక గురుకులాలను చూచి, సంతృప్తి లేనివాడై, చిట్టచివరకు పతంజలి మహర్షి ఆశ్రమాన్ని చేరాడు.

పతంజలి మహర్షి వ్యాకరణ శాస్త్రంలో ఉద్దండ పండితుడు. సాక్షాత్ ఆదిశేషువు యొక్క అవతారంగ పండితులు భావించి ఆయనను గౌరవిస్తూ ఉండేవారు. పాణిని మహర్షి వ్రాసిన సూత్రాలకు ఆయన భాష్యం వ్రాసారు. ఇది వ్యాకరణ శాస్త్రానికి సంబంధించిన గ్రంథం. భాష్యం అనగ వ్యాఖ్యానం అని అర్థం. అన్ని శాస్త్రాలకు అన్ని రకములైన భాష్యాలున్నాయి. కాని పతంజలి వ్రాసిన భాష్యమునకే "మహాభాష్యం" అని పేరు. మరి ఏ ఇతర భాష్యాలకు "మహత్" శబ్దాన్ని వాడకూడదు.

అట్టి పతంజలి మహర్షి ఆశ్రమంలో వ్యాకరణాది శాస్త్రాలు చదువుతూ కొద్దికాలానికే పతంజలి మహర్షికి అభిమాన శిష్యుడైపోయాడు గౌడపాదులు. పతంజలి మహర్షి యొక్క గురుకులం దేశవిదేశముల యందు సుప్రసిద్ధమైనది. అందువలన కొన్ని వేలమంది విద్యార్థులు అచట ఎల్లవేళల పాఠాలు చదువుతూ ఉండేవారు.

రానురాను ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగి పోయింది. అంతమంది విద్యార్థులని ఒక చోట కుర్చుండబెట్టి పాఠాలు చెప్పడం గురువులకు కష్టమైపోతోంది. అట్టి సమస్యను నివారించుటకై పతంజలిమహర్షి "శబ్దశక్తి" తో నడుచు ఒక యంత్రాన్ని నిర్మించాడు. అది చాలా ప్రమాదకరమైనదని దానిని ఎవ్వరు తాకరాదని విద్యార్థులకు నిషేధాజ్ఞలు విధించాడు. ఆ యంత్ర

సహకారంతో ఏకకాలంలో సుమారు వేయి మంది విద్యార్థులకు పాఠాలు బోధించుట సులభమైంది. దానిని పతంజలిమహర్షి మాత్రమే ఉపయోగించేవారు. ఆయన అందుబాటులో లేని సమయంలో "గౌడపాదులవారు" మాత్రమే యంత్రాన్ని సంరక్షిస్తూ విద్యార్థులకు బోధించేవారు.

ఒకానొక రోజున ముఖ్యమైన పనిమీద పతంజలి మహర్షి ప్రక్క గ్రామానికి వెళ్ళారు. ఆయన లేని సమయాన గురుకుల బాధ్యతలను తన ప్రధాన శిష్యుడైన గౌడపాదులవారికి అప్పగించాడు. గౌడపాదులు విద్యార్థులందరికి పాఠాలు బోధించి విశాలమైన చెట్టునీడలో క్షణకాలం విశ్రాంతి తీసుకొంటున్నాడు. ఆ సమయాన దుడుకు స్వభావం కల ఒక విద్యార్థి "శబ్దయంత్రం" దగ్గరకు వచ్చి, దానిని చేతితో తాకుచు చేయిపెట్టకూడని స్థలంలో తన చేతితో ఏదో ఒక మీటను నొక్కాడు. అంతే! పెద్ద శబ్దంతో "శబ్దయంత్రం" పేలిపోయింది. దాని చుట్టు ఉన్న కొన్ని వందలమంది విద్యార్థులు క్షణకాలంలో బూడిదగ మారిపోయారు. కొన్ని వందలమంది గాయపడ్డారు.

గురుకులమంత బీభత్సంగ మారిపోయింది. ఎక్కడ చూచిన విద్యార్థుల శరీర అవయవ ఖండాలే! దుర్వార్తను వినిన పతంజలి మహర్షి పరుగుపరుగున ఆశ్రమానికి వచ్చాడు. ఆయన కళ్ళు వాచిపోయి ఉన్నాయి. వర్షధారల వలె కన్నీటిని స్రవిస్తున్నాయి. నోటమాట వచ్చుటలేదు. చాలామంది విద్యార్థులు నాశనమైపోయారు. కొన్నివందల మంది గాయపడ్డారు. తను కష్టపడి తయారు చేసిన "శబ్దయంత్రం" విద్యార్థి వినాశానికి దారితీసింది అని దుఃఖిస్తూ పరిసరాలను చూస్తున్నారు.

అదే సమయాన గౌడపాదుడు నెమ్మదిగ వస్తున్నాడు. మహర్షి ముఖం మీద దుఃఖము, సంతోషము కనిపించాయి.( గౌడపాదులు జీవించి ఉన్నందులకు సంతోషము) తన సహ విద్యార్థులందరు చనిపోయినందుకు గౌడపాదుడు బిగ్గరగ ఏడుస్తున్నాడు.

దుఃఖంతో బాటు అతని హృదయం భయంతో వణికి పోయింది. గురువుగారి అనుమతి లేకుండగ తన విద్యార్థులను "శబ్దయంత్రం" వద్ద ఉంచి

బయటకు వెళ్ళాడు. అందువలననే ఈ ప్రమాదం జరిగింది. "శబ్దయంత్రం" ప్రమాదకరమైనదని అతనికి తెలుసు. తన తప్పును తెలుసుకొన్న గౌడపాదులు తలయెత్తి గురువులను చూడలేక పోతున్నాడు. సిగ్గుతో తలదించుకొని నిలుచున్నాడు.

ఇంతలో పతంజలి మహర్షి ధీరగంభీర స్వరంతో "గౌడపాదా!" అని పిలిచారు. గజగజలాడి పోయి వణికి పోతున్నాడు గౌడపాదుడు.

"నా ఆజ్ఞను అతిక్రమించి ప్రవర్తించి పాపం చేశావు. దీనికి శిక్ష అనుభవించవలసిందే! ఈ క్షణమే నా ఆశ్రమం నుండి బయటకు వెళ్ళిపో! నీవు ఒక్కరికి మాత్రమే మహాభాష్యాన్ని ఉపదేశించు. అంతవరకే నీకు అది జ్ఞాపకం ఉంటుంది. ఒకరికి చెప్పిన తర్వాత నీవిద్యనంత మరిచిపోతావు! నేను కూడ ఇక ఎవ్వరికి మహాభాష్యాన్ని పాఠం చెప్పను.! వెళ్ళు! అని ఆజ్ఞాపించారు.

(గమనిక:- ఉత్తరభారతదేశంలో ఈ కథ ప్రచారంలో ఉంది. శ్రీదీనదయాళ్ ఉపాధ్యాయుల వారి మూలం నుండి ఈ కథను గ్రహించడమైనది. దీనిని శ్రీపురివండ అప్పలస్వామిగారు తెలుగులో అనువాదం చేసారు.) **(సశేషం)**

శ్రీమతి నాగమణి & శ్రీ నాగపురి రవీంద్రకుమార్ గార్ల పుత్రుడు
**చి॥ సాకేత్ 17వ జన్మదినోత్సవము** 14.11.2010 బుధవారం
జమ్మికుంటలో జరుపుకున్న సందర్భంగా, **శ్రీస్వామీజీ వారి ఆశీస్సులు అర్థిస్తూ,**
**బుర్ర సుగుణ, అయిలయ్య, రాజేంద్రప్రసాద్, కవిత, సాధన**

శ్రీమతి మాధవిలత & శ్రీ తాడేపల్లి రామకృష్ణ శాస్త్రి గార్ల పుత్రుడు
**చి॥ లక్ష్మీనరసింహ దత్త పుట్టిన రోజు**
01.11.2010 సోమవారం Detroit, U.S.A లో జరుపుకున్నారు.
**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

శ్రీమతి దుర్గాకుమారి & శ్రీ రామారావు గార్ల మనుమడు
శ్రీమతి శారద & శ్రీ రాము గార్ల ప్రథమ పుత్రుడు
**చి॥ దత్తసాయి మొదటి పుట్టినరోజు**
04.11.2010 గురువారం హైదరాబాదు లో జరుపుకున్నారు.
**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**




(గత సంచిక తరువాయి)

22 వ అధ్యాయం.. పరీక్ష

# గురువులెందుకు?

"తెలియని వారికి ఉపదేశించవచ్చు"

"దేవా, ఈ దాసుడు అగ్నిలో దూకమన్నా దూకుతాడు. శాసించండి చాలు."

"మొదట మేము చేసిన శాసనం ఆచరిస్తే, ఆపైన మరో శాసనం ప్రసక్తి"

"నా వెనుకటి జీవితాన్ని ఇక్కడితో దహనం చేశాను. గురుదేవా, వెనుకటి మాటలు నాకు వొద్దు. ఇప్పుడు చెప్పండి. ఈ కంఠం నరికి తమ పాదాల దగ్గర పెట్టమంటారా, చెప్పండి?"

"వెనుకటి జీవితంతోపాటు వెనుకటి గురువును గూడా దహనం చేశావా?"

"కాలభైరవా! కాలభైరవా! శాంతం పాపం, శాంతం పాపం."

"నోటి వెంబడి కూత కూసేటప్పుడే జాగర్త వుండాలి."

"ఆ గురువులు చెప్పిన సాధన అప్పుడయిపోయింది, ఇప్పుడు ఈ గురువుల సాధన కొత్తగా మొదలుపెడదామని నా ఊహ."

"గురువు లిందరున్నారా?"

"నాకర్థం కాలేదు గురుదేవా?"

"ఒక్కడే ఒక్క గురువున్నాడు, లోకమంతటికీ"

"ఎవరాయన?"

"కాలభైరవుడు"

"నాతండ్రి కాలభైరవుడా?"

"నీ తండ్రంటున్నావు. ఆయన్ని నీవు గుర్తించగలవా?"

"ఆయన మనోవాచామగోచరుడు. యతో వాచో నివర్తంతే – అప్రాప్య మనసా సహ"

"బాగా బట్టీ పట్టావు ... ఇంకేం, గుర్తించే శ్రమ తప్పిపోయింది, హాయిగా."

"క్షమస్వ గురుదేవా క్షమస్వ! నా తప్పు నాకు తెలియటం లేదు."

"తమస్సు తారులాగా పట్టివున్న బుద్ధికి, చిరువెన్నెలలాగా చల్లచల్లగా వున్న జ్ఞానజ్యోతి అంతుబట్టదు. అయినా, మెల్లిగా ప్రయత్నించు, నువ్వు చెప్పావే, యేమిటీ– మనో వాచో .... చానో .... ఏమిటది?"

"మనో వాచా మగోచరుడు"

"అబ్బ, నోరు గూడా తిరగటం లేదు. ఇంతకూ ఆ మాట ఎవరు చెప్పారు?"

"వేదమాత"

"ఎందుకు చెప్పింది?"

" ...ఏమో"

"దాన్ని గురించి ఆలోచించటం మానెయ్యమనటం కోసం వేదమాత ఆ మాట చెప్పిందా?"

"అబ్బే ... అదికాదు"

"అయితే, మరేమిటి?"

"అంతుబట్టటం లేదు"

"ఎంతవరకు బుద్ధి ప్రసరిస్తుందో అంతవరకు ఆ కాలభైరవుణ్ణి గురించి విచారించాలి. అలా విచారించగా, విచారించగా, ఆ విచారణకి ఆవల వున్న తత్త్వం దానంతటదిగా స్ఫురిస్తుంది. ఆ విధానాన్ని సూచించటానికే వేదమాత అలా చెప్పింది."

"చిత్తం"

"కనుక ఇప్పుడు విచారించు, కాలభైరవుడంటే ఎవరూ?"

"ఈ ప్రక్రియ నాకు ఇంతకు ముందు తెలీనిది. తమరే మార్గం చూపాలి."

"బుద్ధి ప్రవేశపెట్టు, ముందు కాలభైరవుడు అనే పదానికి అర్థమేమిటి?"

"నల్లగా వున్న భైరవుడు – నల్లగా – భయంకరంగా వున్నవాడు."

"కాల – భైరవ అనే పదాలకు ఇంకేమీ అర్థాలు లేవా?"

"కాలమంటే, మామూలుగా సూర్యోదయ, సూర్యాస్తమయాలవల్ల వచ్చే కాలమని గూడా వుంది. కాని అది యిక్కడ అన్వయిస్తుందా?"

"మంచిది. అన్వయించకపోతే పదం యెందుకు ఉపయోగిస్తారు గురువులు? అయినా అన్వయిస్తుందో లేదో ఆలోచించు. ఏకాగ్రంగా ఆలోచించు. నిస్వార్థంగా ఆలోచించు. ఆ ఆలోచనే తపస్సు. తపస్సుతోనే పరతత్వాన్ని తెలుసుకునే ప్రయత్నం చెయ్యమని వేదంలో వినలేదా నువ్వు?"

"విన్నాను – కాని తపస్సు అంటే – మంత్రానుష్ఠాన మనుకున్నా."

"మంత్రానుష్ఠాన మన్నా యిదే. మంత్రమంటే మననమని గదా అర్థం?" అనుష్ఠానం అంటే అనుసరించి వుండటం. లోపల మననం నిరంతరంగా జరుగుతుండగా, ఇటు అటూ పోకుండా ఆ మననాన్ని అనుసరించి వుండటమే మంత్రానుష్ఠానం, ఇదే తపస్సు."

"అన్వయిస్తోంది."

ఆ రూపం తనంత తానుగా ఉపసంహరించుకొనే వరకు, అంటే, ఆ శరీరం వదిలి పోయేవరకు నీవు మరో గురుస్వరూపాన్ని ఆశ్రయించే ప్రసక్తిలేదు. అలాంటి ఆలోచన వచ్చినా శిష్యుడు పతితుడవుతాడు.

"ఈ విషయం శాస్త్రాలలో సుప్రసిద్ధమే"

"కనుకే నువ్వు చెయ్యాల్సింది, అప్పుడు చెప్పిన సాధన. అప్పుడు చెప్పిన ఆజ్ఞలు దహించటం కాదు. ఇప్పటికి అవసరమైన మార్పు లేవయినా వుంటే, అవి గురువు యొక్క యిప్పటి రూపం ద్వారా ఆజ్ఞలుగా వస్తాయి. వచ్చినవాటిని నిర్నిబంధంగా ఆచరించాలి. వెనుక అలా చెప్పావుగా అనరాదు. చెప్పని వాటి విషయంలో వెనకవి ఆచరిస్తూ వుండవలసిందే." (సశేషం)

# దత్తపదీయం - 45

**దత్తపదీయం- 44 సమాధానాలు- సవరణ**

641) ఎ, 642) బి, 643) బి, 644) బి, 645) బి, 646) ఎ, 647) బి, 648) బి, 649) సి, 650) బి, 651) బి, 652) సి, 653) బి, 654) సి, 655) సి, 656) బి, 657) బి, 658) బి, 659) ఎ, 660) ఎ.

పాఠకులందరు పాల్గొని సమాధానాలు కవరు మీద గాని, కార్డు మీద గాని వ్రాసి, "దత్తపదీయం" C/o భక్తిమాల, దత్తపీఠం, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమ, మైసూరు" అని వ్రాసి పంపించాలి. సమాధానాలు వ్రాసి పంపించినవారికి స్వామీజీ ఆశీస్సులను అందిస్తున్నారు. భక్తిమాల మీ చేతికొచ్చిన15 రోజులలో మీ సమాధానాలు మాకు చేరాలి- సంపాదకులు

861) దశరథుని మాటలు విని జనకుడు ఏమి పల్కెను

ఎ) ద్వారపాలకుడు అడ్డగించినాడా బి) లోపలకు ఏలరాకూడదు

ఇ) ఈ రాజ్యము మీదే! ఎఫ్) అన్నియును.

862) ఈ వివాహము చేసికొను కన్యలు ఏ విధముగ ఉన్నారు

ఎ) ప్రజ్వరిల్లుచున్న అగ్నిజ్వాలలవలె బి) సిగ్గుతో

863) వారు కూడ దేనిని ధరించారు

ఎ) నూతన వస్త్రములు బి) మంగళతోరములను

864) జనకుడు ఎచట వేచి యున్నాడు

ఎ) రాజప్రాసాదంలో బి) యజ్ఞవేదిక వద్ద

865) దశరథుడు ఎవ్వరితో లోనికి ప్రవేశించెను

ఎ) కుమారులతో బి)ఋషులతో సి) అందరితో

866) జనకుడు వశిష్ఠునితో ఏమని పల్కెను

ఎ) ఋషుల సహాయముతో వివాహ క్రియను జరిపించుము

బి) విశ్వామిత్రునిచే చేయించుము

867) వశిష్ఠుడు ముందుగ దేనిని నిర్మించెను

ఎ) పర్ణశాలను బి) అగ్నివేదికను

868) ఎవ్వరి సహాయంతో నిర్మించెను

ఎ) ప్రజలు బి) విశ్వామిత్ర శతానందులు

869) అగ్నివేదిక చుట్టు దేనిని ఉంచెను

ఎ) ముగ్గులను బి) గంధపుష్పములను

870) పాలికలు ఎటువంటివి

ఎ) మట్టితో చేసినవి బి) వెండితో సి) బంగారముతో

871) కుంభములు ఏ విధముగ ఉన్నవి

ఎ) అంకురములు కలిగి రంధ్రములతో కూడినవి బి) ఖాళీగ ఉన్నవి

872) మూకుళ్ళు ఏ విధముగ ఉన్నవి

ఎ) అంకురములతో నిండినవి బి) ఖాళీగా ఉన్నవి

873) అచట ఎటువంటి పాత్రలు గలవు

ఎ) ధూపపాత్రలు బి) శంఖాకార సి) స్రుక్కులు స్రువాలు

ఎఫ్) అక్షతలు గలవి జి) అన్నియును

874) వేదిక చుట్టు వశిష్ఠుడు వేటిని ఉంచెను

ఎ) వస్త్రములను బి) దర్భలను

875) జనకుడు సీతను తీసికొనివచ్చి అగ్ని సమక్షమున ఎచట నిలబెట్టెను?

ఎ) రాముని ఎదురుగ బి) ప్రక్కగ సి) వెనుకగ

876) జనకుడు రామునితో ఏమనెను

ఎ) ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ, ప్రతీచ్ఛ చైనాం

భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా బి) శుక్లాంబరధరం.

877) "ఇయం సీతా" శ్లోక భావమేమి

ఎ) ఈమె సీత! నా యొక్క కుమార్తె! నీకు సహధర్మచారిణి

బి) ఈమెను స్వీకరించు. నీ యొక్క చేతితో ఈమె చేతిని పట్టుకో,

నీకు శుభమగుగాక! సి) అన్నియును

878) ఈ శ్లోకమునకు ప్రసిద్ధి ఏమి?

ఎ) పారాయణ చేస్తే వివాహమవుతుంది బి) అన్ని శుభములే సి) రెండును

879) సీత ఎటువంటిది

ఎ) మహా భాగ్యవంతురాలు బి) పతివ్రత సి) రెండును.

880) ఆమె రాముని ఏవిధంగ అనుసరించి ఉండగలదు

ఎ) వెలుగువలె బి) నీడవలె

# సద్గురు సన్నిధిలో దంపతుల వివాహ రజతోత్సవ వేడుకలు

సద్గురుదేవులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ గృహస్థులందరికీ ఒక విశేషమైన అనుగ్రహాన్ని సంకల్పించారు. అందులో ముఖ్యంగా వివాహమై ఇరవై ఐదు సంవత్సరములు దాటిన దంపతులందరూ పాల్గొనవలసిందిగా ఆదేశించి ఒక చక్కటి సదవకాశాన్ని కల్పించారు.

శ్రీస్వామీజీ వారి సమక్షంలో దండలు మార్చుకొని అనుగ్రహాన్ని పొందాలనుకొనే దంపతులందరూ ఈ వేడుకలలో పాల్గొనవచ్చు. పెళ్ళి 25 సంవత్సరాలు నిండి ఉండాలి అనే నియమం లేదు.

ఈ కార్యక్రమము ది. **2-1-2011** వ తేదీ ఆదివారం నాడు క్షిప్రగణపతి, శ్యామకమలలోచన దత్తస్వామి, మరకత రాజరాజేశ్వరీ దేవస్థాన సన్నిధిలో విజయవాడ పటమట ఆశ్రమంలో సద్గురు అనుగ్రహంతో జరుగనున్నది.

ఈ కార్యక్రమములలో పాల్గొనదలిచినవారు ముందుగా విజయవాడ ఆశ్రమంలో పేర్లు నమోదు చేసుకొనవలెను.

ఇటువంటి సదవకాశం ఇంతకుముందు ఎవరికీ రాలేదు. కనుక ఈ అవకాశాన్ని జారవిడుచుకోవద్దు. స్వామీజీ సన్నిధిలో వివాహం జరగలేదని అనుకొంటున్న భక్తులందరికీ కూడా విశేషమైన మహాప్రసాదము గురుదేవులు అనుగ్రహిస్తున్నారు.

**రండి, పాల్గొనండి, స్వామీజీ సన్నిధిలో వివాహం చేసుకున్న అనుభూతిని పొందండి.**

వివరాలకు సంప్రదించవలసిన చిరునామా -

జయలక్ష్మీ మాతృమండలి,

శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము,

పటమట, విజయవాడ-10

0866-2555541, 2555897



# శ్రీ స్వామీజీ వారి భారతసూక్తులు

## నాడీజంఘుని కథ - (2)

తృప్తిగ కడుపునిండ భోజనం చేసి, హాయిగ నిద్రపోయిన గౌతముడు మరునాడు ఉదయం లేచాడు. వాడికి గతం అంతా ఒక్కమారు గుర్తువచ్చింది. వ్యాపారుల మధ్య నుండి విడిపోయిన తాను ఏ విధంగ జీవించాలి? అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో ఆతిథ్యమిచ్చిన కొంగ బ్రాహ్మణునికి ఎదురుగ వచ్చి నిలిచింది. మనిషి యొక్క పేదరికం పోగొట్టడానికి నాలుగు ఉపాయాలు ఉన్నాయి. వెండి, బంగారం, ఆలోచన, మిత్రుడు అను నలుగురిలో దారిద్ర్య బాధను పోగొట్టువాడు స్నేహితుడు ఒక్కడే!

**"చతుర్విధా హ్యర్థసిద్ధిః బృహస్పతి మతం యథా**
**పారం పర్యం తథా దైవం కామ్యం మైత్రమితి ప్రభో"**

వంశపారంపర్యంగ గాని, దైవవశంవలన గాని, ధనం లభిస్తుంది. అయితే మిత్రుని వలన ధనం సంపాదించుట మేలని బృహస్పతి వచనం. కశ్యపుని వంశంలో పుట్టిన నేను, నీతో స్నేహం చేయుచుండగ నీకు కష్టాలు ఎలా వస్తాయి? సరే! దీనికి తగిన ఉపాయం చెప్తాను! విను! అంది కొంగ.

నాకు విరూపాక్షుడు అనే మిత్రుడున్నాడు. మధువ్రజం అతని పట్టణం. ఇక్కడకు దగ్గరలోనే ఉంది. నీవు వెళ్ళి అతని దర్శనం చెయ్యి! అతనికి నేను పంపించినట్లుగ చెప్పు! అతడు సంతోషిస్తాడు. నీకు బంగారం, మణులు, ధనం ఇచ్చి నిన్ను సత్కరిస్తాడు. దానితో నీ యొక్క దారిద్ర్యబాధ తీరి పోతుంది. అని కొంగ చెప్పింది.

కొంగ యొక్క మాటలకు బ్రాహ్మణుడు సరే! అన్నాడు. నెమ్మదిగ ప్రయాణం చేసి విరూపాక్షుని దర్శించాడు. తనను నాడీజంఘునికి ఆప్త మిత్రునిగ

పరిచయం చేసికోన్నాడు. అతడు పంపగ ధనార్థినై నీదగ్గరకు వచ్చాను. అని వినయంగ గౌతముడు విరూపాక్షునికి తెలియచేసాడు.

బ్రాహ్మణుడు చెప్పిన మాటలు విరూపాక్షునికి నచ్చలేదు. బ్రాహ్మణుని ఎగాదిగ తేరిపార చూసాడు. బ్రాహ్మణ లక్షణాలు ఎక్కడ అతనిలో కనబడలేదు. వీడు పరమనీచుని వలె కనిపిస్తున్నాడు అనుకున్నాడు. నీవంశం, చదువు, నడవడి ఉన్నది ఉన్నట్లుగ చెప్పు అని విరూపాక్షుడు ప్రశ్నించాడు. అందుకు బ్రాహ్మణుడు ఏ మాత్రం జంకలేదు. తనయొక్క చరిత్ర అంత యథాతథంగ చెప్పాడు. అతని చరిత్రను వినిన విరూపాక్షుడు ఎట్టి మానసిక వికారం పొందలేదు. ఈ బ్రాహ్మణుడు ఎటువంటి వాడైన నాడీజంఘునికి స్నేహితుడు. అదే వీడి యోగ్యత! కాబట్టి అతని దరిద్రం తీర్చే అంత ధనమిచ్చి పంపిస్తాను అనుకొన్నాడు.

"తస్య ప్రియం కరిష్యామి స హి మమాశ్రితః సదా
భ్రాతా మే బాంధవశ్చాసౌ సఖా చ హృదయంగమః"

వెంటనే ఆ బ్రాహ్మణుని అవసరాలకు తగినట్లుగ తిండి, బట్టలు ఇప్పించాడు. మరునాడు కార్తిక పౌర్ణమి. ఆ రోజు వేలకొలది బ్రాహ్మణులకు దానం చేయుటకై విరూపాక్షుడు ధనరాశులను సిద్ధం చేసి ఉంచాడు. బ్రాహ్మణునికి బంగారు పళ్ళెంలో భోజనం పెట్టించి, ఆ పళ్ళెమును పాత్రను ఇచ్చివేసాడు. మోయలేనంత బంగారాన్ని, రత్నాలను ఇచ్చి పంపించాడు.

బ్రాహ్మణుడు వీటినన్నింటిని ఆనందంగ తీసికొన్నాడు. బరువు ఎక్కువ అగుటచే భుజాలు, చేతులు మార్చుకుంటూ ఆయాసపడుతూ నడుస్తున్నాడు. బరువు వలన మెడ, వీపు, చేతులు నొప్పిపుడుతున్నాయి. ఆ నొప్పి వలన వంగిపోతున్నాడు. అయిన అతి కష్టంమీద మొత్తం బంగారాన్ని మోసుకొని వచ్చి నాడీజంఘుడు ఉండే మర్రిచెట్టు దగ్గరకు వచ్చాడు. బంగారాన్ని ధనరాశులను తీసికొని వచ్చిన బ్రాహ్మణుని చూచి నాడీజంఘుడు సంతోషించాడు.

తన యొక్క రెక్కలను విసన కర్రగ చేసి అతనికి గాలిని విసిరి సేదతీర్చాడు. ఇంతలో రాత్రి అయింది. ఆకలి కూడా తీరింది. అలసటవలన బ్రాహ్మణుడు ఆదమరచి అచటనే నిద్రపోయాడు. తెల్లవారిన తర్వాత నిద్రలేచాడు. ఈ

పాపాత్మునికి దుష్టమైన ఆలోచన వచ్చింది. ఇప్పటికి ఈ ఆహారం సరిపోతుంది. నేను నా యొక్క ఊరుచేరు సరికి ఆలస్యమవుతుంది. మార్గమధ్యంలో ఆకలి వేస్తే ఆహారం దొరకదు కదా! అందువలన బలిసి ఉన్న ఈ కొంగను చంపి మాంసం దాచుకొంటాను అనుకొన్నాడు. వెంటనే ప్రక్కనే ఉన్న పెద్దకర్రతో కొంగను చంపివేసాడు. దాని ఈకలన్ని పీకివేసి, మాంసాన్ని సంచిలో వేసికొని బయలుదేరాడు.

మధువ్రజంలో ఉన్న విరూపాక్షునికి కొన్ని సందేహాలు వచ్చాయి. మనస్సు కీడు శంకిస్తోంది. మిత్రుడు నాడీజంఘుడు ఇంతవరకు రాలేదు. అతనికి ఏదో ఆపద వచ్చి ఉంటుంది. గౌతముడు దుష్టబ్రాహ్మణుడు. ఎంతటి నీచ కృత్యమైన చేస్తాడు అని తలచి భటులను పంపించాడు. వారు విషయమంత తెలిసికొని మాంసపుముద్దతో వెళ్ళిపోవుచున్న గౌతముని పట్టుకొని విరూపాక్షుని ఎదుట నిలబెట్టారు. విరూపాక్షుడు కోపావేశంతో బ్రాహ్మణుని ముక్కలు ముక్కలుగ చేసి మీరందరు తినండి అన్నాడు. ఛీ!ఛీ! కృతఘ్నుని మాంసం మేము తినమని రాక్షససేవకులు నిరాకరించారు. అతనిని చిత్రహింసలు పెట్టి మాంసపుముద్ద వలె నున్న గౌతముని కుక్కలకు ఆహారంగ పడవేసారు. కుక్కలు దగ్గరగ వచ్చి వాసన చూసి దూరంగ వెళ్ళి పోయాయి.

"మిత్రద్రోహీ నృశంసశ్చ కృతఘ్నశ్చ నరాధమః
క్రవ్యాదైః కృమిభిశ్చైవ న భుజ్యన్తే హి తాదృశాః"

మంచి గంధపు చెక్కలతో నాడీజంఘునికి అంతిమసంస్కారాన్ని విరూపాక్షుడు పూర్తిచేశాడు. పరోపకారపారీణుడైన నాడీజంఘుడు దివ్యరూపంతో స్వర్గానికి వెళ్ళాడు. బ్రహ్మదేవుని మిత్రుడగుట వలన, దేవేంద్రుని మనస్సు గెలిచిన వాడగుటచే నాడీజంఘునికి మరల ప్రాణంపోసి భూలోకానికి పంపించారు ఇంద్రాది దేవతలు.

అనగ చితి మంట ప్రక్కనే ఒక ఆవు తన దూడకు ప్రేమగ పాలను ఇస్తోంది. పాలచేపు రాగానే దూడ నోటినుండి పాలనురగ జారిపడి గాలిలో ఎగిరి నాడీజంఘుని చితి పై పడింది. ఆ నురగ పడిన వెంటనే నాడీజంఘుడు

తిరిగి బ్రతికాడు. మునుపటి రూపంతోనే విరూపాక్షుని వద్దకు నడచి వచ్చాడు. అచటి వారందరు ఇదంత దైవమాయ అనుకొని కొంగ యొక్క సద్గుణాలను పలువిధాలుగ కీర్తించారు. తన వల్ల గౌతమునికి దీన దశ ప్రాప్తించిందని నాడీజంఘుడు బాధపడ్డాడు. నాడీజంఘుని కోరికను కాదనలేక గౌతముని విడచిపెట్టాడు విరూపాక్షుడు.

**మిత్రుని కంటె మరొక సంపదలేదు**
**కృతఘ్నత కంటె మరణము మేలు.**

శ్రీమతి & శ్రీ పంపన రామారావు గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ లక్ష్మీనర్సింహ్మారావు (కిరణ్)**
శ్రీమతి & శ్రీ కొప్పిశెట్టి గోపాల్ గార్ల కనిష్టపుత్రిక
**చి॥ల॥సౌ॥ మాధురి ల**
వివాహం 19.11.2010 శుక్రవారం యాప్రాల్‌లో జరిగింది.
**ఈ నూతన వధూవరులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

శ్రీమతి & శ్రీ K. ప్రకాష్ రెడ్డి గార్ల కనిష్టపుత్రుడు
**చి॥ రాకేష్ రెడ్డి**
శ్రీమతి & శ్రీ B. అరవింద్ రెడ్డి గార్ల ఏకైకపుత్రిక
**చి॥ల॥సౌ॥ మస్మిత ల**
వివాహం 21.10.2010 గురువారం తిరుమలలో జరిగింది.
**ఈ నూతన వధూవరులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

శ్రీమతి సాయికుమారి & శ్రీ మండలపర్తి వెంకట రమణారావు గార్ల ద్వితీయ పుత్రుడు
**చి॥ సాయి ప్రదీప్ ఉపనయనము**
24.06.2010 గురువారం శ్రీశైలంలో జరిగింది.
**ఈ వటువు పై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

**శ్రీమతి బేబీ సునీత & శ్రీ దోగిపర్తి నరేంద్రబాబు గార్ల నూతన గృహప్రవేశం**
21.10.2010 గురువారం అమెరికాలో జరుపుకున్న సందర్భంగా
**శ్రీస్వామీజీ వారి ఆశీస్సులు అర్థిస్తూ .....**
**శ్రీ.V. కృష్ణారావు, నాగేశ్వరమ్మ (మాధవి), చీరాల**

## చౌదవరం, గుంటూరు 'ధం' దత్తనాథ క్షేత్రమున

## 'సింధూర' శిల కార్యసిద్ధిహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ- ది. 26-1-2011 న.





హనుమంతుడు సింధూర ప్రియుడు. అందుకే సింధూరవర్ణశిలతో కార్యసిద్ధి హనుమంతుని విగ్రహము నిర్మించి. 'ధం' దత్తనాథ క్షేత్రమున ప్రతిష్ఠించవలెనన్న సద్గురుదేవులు, దత్తపీఠాధిపతులు శ్రీశ్రీశ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ వారి సంకల్పాదేశానుసారము, అనేకవ్యయము, ప్రయాసల కోర్చి సింధూరశిల ఆంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణమును 'ధం' దత్తనాథక్షేత్ర కమిటీ వారు గావించి యున్నారు.

రోమరోమమునందు రామనామముతో విలసిల్లుచున్న, అసాధారణమైన ఈ సింధూరశిల కార్యసిద్ధి హనుమంతుని ప్రతిష్ఠామహోత్సవమును, ఆలయ కుంభాభిషేకమును **ది. 26.1.2011 బుధవారం** నాడు జరుపుటకు శ్రీస్వామీజీ నిశ్చయించినారు. ఈ ప్రతిష్ఠ మన క్షేత్రమునకు మరియు గుంటూరు పట్టణ అభివృద్ధికి కారణము కాగలదని, ఈ పవిత్రోత్సవ దర్శనము పునర్జన్మరహితమును ప్రసాదించునని ఆశీర్వదించినారు.

కనుక యావన్మంది భక్తులు ఈ పవిత్రోత్సవమున, పలుసేవలలోనూ పాల్గొని సద్గురు దేవుల మరియు సింధూరశిల కార్యసిద్ధి హనుమంతుని అనుగ్రహమునకు పాత్రులు కావలసినదిగా ప్రార్థించుచున్నాము.

వివరములకు:

| | | | |
|---|---|---|---|
| మిట్టపల్లి రాజేంద్ర | :9440632900; | పి.వెంకటేశ్వర రెడ్డి | :9989459659 |
| డా.వెంకటరత్నం | :9490450591; | డి.వి.రావు | :9010613411 |

ఇట్లు

'ధం' దత్తనాథ క్షేత్రము, 10వ KM,

గుంటూరు- చిలకలూరిపేట హైవే, చౌదవరం, గుంటూరు రూరల్.

# శ్రీస్వామీజీ వారి పర్యటనా విశేషాలు

**ఒమాహా, నెబ్రాస్కా**

యిచ్చటకు శ్రీస్వామీజీ మే 5, 2010న చేరుకొనిరి. మరునాటి సాయంకాలమున స్థానిక ప్రసన్నగణపతి హిందుదేవాలయమున స్వాగతసభ, శ్రీచక్రపూజ నిర్వహించబడినవి. అనంతరము ట్రస్టీలు, భక్తులచే దత్తాత్రేయ పాదుకాపూజ నిర్వహించబడినది. శ్రీబొగ్గారం ప్రసాదరావు గారు తెలుగులో రచించిన హనుమాన్ శతకమును ఆవిష్కరించిరి.

మే 7, 2010న ఒమాహా యూనివర్శిటి యందలి సంగీతవిభాగమును సందర్శించిరి. ప్రొ.టామ్ రోలండ్, సంగీతశాఖ ప్రధానాచార్యులు స్వాగతము పలికిరి. వారి విద్యార్థులు, మైసూరు ఆశ్రమ సంగీతకారులు తమతమ వాయిద్యనైపుణ్యములను తెలియజేస్తూ రెండు ప్రదర్శనలిచ్చిరి. సాయంకాలమున, దేవాలయమునందు భజనసత్సంగము నిర్వహించబడినది.

మే 8, 2010న హాలండ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ థియేటర్, ఒమాహా యందు 'జీవస్వర రాగసాగర' నిర్వహించబడినది. ఈ సంధర్భముగా ఒమాహా నగర మేయర్ ఈ దినమును అనగా మే 8, 2010ని '**మ్యూజిక్ కన్సర్ట్ ఫర్ మెడిటేషన్ అండ్ హీలింగ్ డే**' గా ప్రకటించిరి. శ్రీస్వామీజీ తమ ప్రారంభ భాషణమున అమెరికా దేశమున తమ ఈ రాగసాగర యాత్ర తమకు అత్యంత సంతృప్తి, ఆనందముల నిచ్చినవని తెలిపిరి. సంగీతము రోగములను పూర్తిగా తగ్గించే ఔషధము కాదని, వైద్యము మరింత ఫలవంతముగా పనిచేయుటకు దోహదపడే వాహకమని వివరించిరి.

ఈ విభావరి యందు శ్రీస్వామీజీ ప్రణవ స్వరూపం (ఋష్యకేతుప్రియ రాగము), వందే సంతం హనుమంతం (భజన), ముఖ్య రాగసాగర యందు శ్రోతధ్వని, ఇందుకంటి, నటభైరవి రాగమాలిక, డాన్సింగ్ ట్యూన్, సామరాగమున మంగళము వినిపించిరి. ధ్యానసంగీతవిభావరుల యందు మొదటిసారిగా వినిపించిన శ్రోతధ్వని రాగము శ్రోతలపై అమిత ప్రభావము చూపించినది.

మే 9, 2010న శ్రీస్వామీజీ మహాగణపతిహోమ పూర్ణాహుతి, శ్రీచక్రపూజ గావించి, 'SIVA - SGS International Vedic Association and Datta Wave - a 24*7 ఇంటర్నెట్ రేడియో స్టేషన్ ను ప్రారంభించిరి. యిందు శ్రీస్వామీజీ వారి సంగీతము, భజనలు నిరంతరము ప్రసారము చేయబడును. అనంతరము, ఒమాహా భక్తులు శ్రీస్వామీజీ వారి 68వ జన్మదినవేడుకలను ముందుగానే జరుప ఉత్సహపడి, శ్రీస్వామీజీవారికి కేక్ సమర్పించిరి.

దీనితో శ్రీస్వామీజీవారి రాగసాగర, అమెరికా యాత్ర సమాప్తమయినది. సాయంకాలమున శ్రీస్వామీజీ న్యూజెర్సీకి పయనమయిరి.

**న్యూజెర్సీ**

మే 10, 2010 ఉదయమున శ్రీస్వామీజీ యుక్రైనియన్ కల్చరల్ సెంటర్ నందు శ్రీచక్రపూజ నిర్వహించిరి. బాలదత్త విద్యార్థులు భజన సంగీతసేవ, శ్రీమతి యిందు వాసుదేవన్ కర్ణాటక శాస్త్రీయసంగీత గాత్రసేవ, శ్రీమతి కళ్యాణి జోస్యుల వీణాకచేరిసేవ సమర్పించిరి. శ్రీస్వామీజీ తమ సంగ్రహ అనుగ్రహభాషణమున – మీ హృదయము చెప్పినదానినే నమ్మండి. ఏపనినైనా నేను చెప్పానని కాని, మరొకరు చెప్పారని కాని చేయకండి. మీ హృదయములో మీకు వినిపించినదానినే అనుసరించండి, ఆచరించండి, నమ్మండి. పుకార్లను నమ్మకండి. ప్రోత్సహించకండి. మీలో చాలామంది యీ జీవితమొక సమరమని భావిస్తున్నట్లు నాకు తోస్తున్నది. ఆ భావన తప్పు. జీవితము ఒక అందమైన ప్రయాణము. ఈ నౌకలో నీ చోటు నీకున్నది. అందుకని నీ యిష్టము వచ్చినట్లు ఈ పడవను కుదుపుతాను అని భావించకూడదు. పడవను నడిపే నాయకునికి బృహత్తర బాధ్యత వున్నది. మిమ్మల్ని ఈ సాగరం దాటించుటకై ఆయన ఎన్నో త్యాగములు చేసినాడు. నీకు ఈ పడవలోనికి నీ యిష్టప్రకారము వచ్చావు. అందుకని తోటివారికి సహాయపడు. వారి సహాయము పొందు, జయ గురుదత్త. – అని ఉద్బోధించిరి.

ఈ సత్సంగ సమయమున ప్రవహించి, పొర్లిన ఆ ప్రేమ, భక్తి, కరుణ, నమ్మకము, సంతోషము, ఆత్మీయత, అన్నీ కలిసి ఉప్పొంగి, ఉద్వేగభరిత ఆనందానుభూతిని అనుభవించవలసినదే కానీ వర్ణించ వీలుకాదు. జయ గురుదత్త

శ్రీగురుదత్త                                        జయగురుదత్త

# శ్రీనృసింహ సరస్వతీస్వామివారి పాదుకాగుహ నిర్మాణము
## మచిలీపట్టణము



పరమపూజ్యులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆదేశానుసారము, శ్రీఅనఘాదేవీ సమేత అత్రివరద దత్తదేవస్థానము, మచిలీపట్టణం శ్రీదత్తాశ్రమములో గురుదేవులచే ప్రతిష్ఠించబడిన శ్రీనృసింహసరస్వతీ స్వామి వారి పాదుకలకు అపూర్వమైన గుహ నిర్మాణము జరగబోవుచున్నది.

కనుక భక్తులు ధన, వస్తు రూపంలో సహకరించ ప్రార్థన!

వివరములకు ఈ దిగువ తెలిపిన వారిని సంప్రదించగోరుచున్నాము.

ఫోన్- **09392436556, 09247867659,**

**09030223368,09441071870**

శ్రీగణపతి సచ్చిదానంద దత్తాశ్రమము, బుట్టాయిపేట,

మచిలీపట్టణము, కృష్ణాజిల్లా

అం.ప్ర- **521001.**

ఫోన్ - **08672 222421, 222541.**

# మైసూరు ఆశ్రమంలో జరిగిన ముఖ్యకార్యక్రమాలు

**అతిరుద్ర యాగము**

అవధూత దత్తపీఠము, మైసూరునందు జగద్గురు పరమపూజ్య శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ వారి నిర్దేశకత్వమున, పరమపవిత్ర కార్తీకమాసమున, బోధాయన, ఆపస్థంభ మహర్షులు వివరించిన రీతిలో, వైదిక సాంప్రదాయకముగా, 150 మందికి పైగా వేదపండితులచే 11రోజుల పాటు– నవంబరు 12 నుంచి 22, 2010 వరకు– సదాశివునికి అత్యంత ప్రీతికరమయిన అతిరుద్ర యాగము ప్రపంచశాంతికై నిర్వహించబడినది.

బ్రహ్మగా వ్యవహరించే వేదపడింతుల ఆధ్వర్యమున 121 మంది ఋత్విక్‌లు రుద్రమంత్ర పారాయణచేస్తూ 11 హోమగుండములందు 11 రోజులపాటు ఆహుతులు సమర్పిస్తూ ఆచరించబడిన యీ మహాయాగము యజుర్వేదమున అత్యంత ప్రసిద్ధిగాంచిన మహాయాగము. వేదమున శతరుద్రీయముగా వ్యవహరించబడే 169 మంత్రములు పరమేశ్వరుని సర్వవ్యాపిత్వమును, సర్వజ్ఞత్వమును, ప్రాకృతిక శక్తులన్నియు రుద్రరూపాంశలుగా వివరించుచున్నవి. ఇట్టి మహత్తర మంత్ర పారాయణ, హోమము శివుని రుద్రరూపమును శాంతిపచేయును. 11 రోజుల పాటు ప్రతి దినము ఇట్టి పవిత్ర మంత్రములతో 11 ఆవరణములుగా నిర్వహించిన హోమానంతరము మహేశ్వరుని శాంతిరూపమును స్తుతించే వశోర్ధార మంత్రములతో అఖండ నేతి ధారలతో ఆహుతి గావించుట వలన ప్రపంచమున అఖండశాంతి, సర్వతోముఖ అభివృద్ధి కలుగుచున్నవి.

ఈ పవిత్రహోమ కార్యక్రమమున ఉపాంగములుగా ప్రతిదినము 11 రకముల మణిశిలలతో నిర్మించిన శివలింగములకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, పార్థివలింగ అర్చన, వేదపారాయణము, బిల్వార్చన, నామసంకీర్తనము, అష్టావధానసేవ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించబడినవి.

శ్రీస్వామీజీ వారి ప్రియశిష్యులు, చికాగో వాస్తవ్యులు శ్రీరాధాకృష్ణ

రామచంద్ర అయ్యర్ (క్రిష్‌రామన్), వారి కుటుంబసభ్యులు ప్రధానయాగకర్తలుగా వ్యవహరించిన ఈ మహాయాగమును దేశవిదేశముల నుంచి భక్తులు వేల సంఖ్యలో దర్శించి, శివస్వరూపులు శ్రీస్వామీజీ వారి అనుగ్రహాశీస్సులనందుకొనిరి.

అతిరుద్రయాగమున నిర్వహించిన కార్యక్రమ వివరములు:

నవంబరు 12, 2010.

ఉ॥ 6.00 కావేరి నది నుంచి తీర్థసంగ్రహణము, గణపతిపూజ,

పుణ్యాహవచనము, ఋత్విగ్వరణ, దీక్షాధారణ,

యాగాశాలా ప్రవేశము, అఖండ దీపస్థాపన,

చతుర్లింగాలతో భద్రమండలపూజ, ప్రధానకలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ.

రా॥ 9.00 రుద్రయాగ ప్రారంభము.

ప్రతిదినము ఉదయము 8 గంటల నుంచి 12 గంటల వరకు రుద్ర యాగము, వశోర్ధారా. సాయంకాలము 5 గంటలకు విశేషార్చన, నామసంకీర్తన, సంగీతసేవ, పండితులచే ఉపన్యాసములు.

నవంబరు 22, 2010 మధ్యాహ్నము 12 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించబడినవి.

అతిరుద్రయాగ సందర్భముగా నవంబరు 19, 20 తేదిలలో సాయంకాలము 4 గంటల నుండి 6.30 గంటల వరకు శ్రీస్వామీజీ వారు స్వయముగా క్రియాయోగ తరగతులు నిర్వహించిరి. యిందు శ్రీస్వామీజీ వివిధ ప్రాణాయామములను, యోగాసనములను స్వయముగా ఆచరించి వివరించుటతో పాటు, క్రియాయోగము వలన కలుగు విశిష్ట ప్రయోజనములను సోదాహరణముగా వివరించిరి.

ఈ యోగాతరగతుల యందు పాల్గొనిన షుమారు 650 మంది విద్యార్థులందరునూ ఫేస్‌బుక్.కామ్ నందలి 'దత్తక్రియాయోగ' యందు సభ్యత్వమును పొందవలసినదిగా ఆదేశించిరి. ఈ సభ్యత్వము ద్వారా వీరందరికి శ్రీస్వామీజీవారి నుంచి యోగసంబంధమైన అమూల్య సందేశములు లభించునని, తద్వారా సద్గురువుతో సంబంధం వృద్ధి చెందునని వివరించిరి.

అతిరుద్ర మహాపూర్ణాహుతి దినము- నవంబరు 22, 2010 న నాదమంటపమున శివస్వరూపులు, నాదబ్రహ్మ శ్రీస్వామీజీ వారి పాదములకు చెన్నైభక్తులు సమర్పించిన నాదార్పణ 'సచ్చిదానంద వాద్యవైభవం' దత్తపీఠచరిత్రలో సువర్ణాక్షరాలతో కలకాలము నిలిచిపోయే దివ్యమధురఘట్టము. ఈ సంగీత వైభవమున నాదస్వరం, వేణువు, వీణ, గోటువాద్యం, మృదంగం, తవిల్, కంజీర, ఘటం, మోర్సింగ్, తబల, తంబూర, డోల్కి, కొన్నకోల్ మొదలయిన వాద్యాలతో, మొట్టమొదటి సారిగా 108 మంది సంగీతవిద్వాంసులతో, విద్వాన్ శ్రీ రాజ్‌కుమార్ భారతి గారి సారథ్యంలో నిర్వహించబడినది. నాదమంటపమే ఆనందంతో పులకించినది. ఈ వాద్యవైభవమున ప్రసిద్ధ గాత్ర కళాకారులతో శ్రీస్వామీజీవారి కీర్తనలతో పాటు సంగీతత్రిమూర్తుల కీర్తనలను కూడా సమర్పించిరి.

అతిరుద్రయాగము మహాపూర్ణాహుతి నాడు సమర్పించి ఈ సచ్చిదానంద వాద్యవైభవంతో ఈ పవిత్ర మహాయాగ కార్యక్రమము పరిసమాప్తి కావింపబడినది. జయగురుదత్త.

శ్రీమతి చందన & శ్రీ బచ్చు వెంకట సుబ్బారావు గార్లకు
సుపుత్రుడు **చి॥ అచ్చిష్మాన్**
26.10.2010 మంగళవారం హైదరాబాదులో జన్మించాడు.
**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల ఆశీస్సులు వర్షించుగాక!**

శ్రీమతి & శ్రీ కేసిరెడ్డి అనంతరెడ్డి గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ శ్రీధర్ రెడ్డి**
శ్రీమతి & శ్రీ కొరండ్ల ధర్మారెడ్డి గార్ల కనిష్ఠపుత్రిక
**చి॥ల॥సౌ॥ అఖిల ల**
వివాహం 19.11.2010 శుక్రవారం మామిడాలపల్లిలో జరిగింది.
**ఈ నూతన వధూవరులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

శ్రీమతి శోభ & శ్రీఅశోక్ గార్ల పుత్రిక **చి॥ పావని రెండవ పుట్టిన రోజు**
24.11.2010 బుధవారం U.S.A లో జరుపుకున్న సందర్భంగా
**శ్రీస్వామీజీ వారి ఆశీస్సులు అర్థిస్తూ .....**
**రజిత, రామస్వామి, రాధ**

## జయగురుదత్త

పల్లవి:

రాగ తాళ లయ గతులతో రాగసుధారస మాధురి
శ్రుతి శుభగ మ్మొనరించుచు రాగ రాగిణి సాగె

చరణం: మయి మరచిన మధుర క్షణం
మనసెక్కడొ విహరించును
దివ్యమైన అనుభూతుల
తేలియాడు తన్మయాన ...1

నారదాది సంగీత
మర్మజ్ఞుల హృదయ మలర
వీణా వేణువుల నాద
మొదవించెను వియద్వీధి ...2

ఆద్యంతం రమణీయం
ఓంకారం ఒదిగి ఒదిగి
బ్రహ్మ భావన నిలిపెను
మహావాక్య తత్వార్థము ...3

విశ్వ విపంచిని మీటుచు
మానస జలధిని మధించి
సచ్చిదానంద సుధను
రాగారాగణి పంచెను ...4

బ్రహ్మర్షి భళీ యనగ
అమవస నిసి పున్నమవును
మలయపవన మొలయు వసుధ
విశ్వశాంతి విస్తరిల్లు ...5

యోగ మార్గమ్ములోన
నాద శక్తి ఇనుమడించి
యోగిరాజవల్లభుడగు
సచ్చిదానంద గురుడు ...6

రచన: కూచిభట్ల చంద్రశేఖర శర్మ శ్రీదత్తపీఠ ఆస్థాన విద్వాన్

# ఆశ్రమశాఖలయందు జరిగిన ముఖ్యకార్యక్రమములు

జ్ఞానబోధసభ, లోకముడి గరువు వారి ఆధ్వర్యమున ఆశ్రమమునందు ప్రతి మంగళవారం 'సాధుభిక్ష' రూపమున, ప్రతి రెండవ ఆదివారం నాడు 'దత్తభిక్ష' రూపమున 300 మంది పేదలకు అన్నదాన కార్యక్రమము నిర్వహించబడుచున్నది. సెప్టెంబరు మాసమున స్థానిక ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులకు ఆశ్రమం తరఫున పుస్తకములు, పెన్నులు, పెన్సిళ్ళు, స్కూలుబాక్సులు, బ్రష్‌లు, పేస్టులు పంచినారు.

శ్రీగణపతి సచ్చిదానంద జ్ఞాన బోధసత్సంగసభ నాగాయలంక సభ్య భక్తులు, నాచుగుంట, తలగడదీవి గ్రామములందున, స్థానిక శ్రీ ప్రసన్న గణపతి నవరాత్రి పందిరి యందును సామూహిక అనఘాష్టమీ వ్రతములను నిర్వహించిరి. ప్రతి వ్రతమునందు భక్తులచే 'ఓం నమో హనుమతే నమః' మంత్రజపము పదివేలసార్లు జపము చేయించినారు. శ్రీదత్తవిజయానందతీర్థస్వామీజీ వారి 7వ చాతుర్మాస్య వ్రతదీక్షకు ఇతోధికముగా ధనవస్తు సమర్పణ గావించినారు.

జయలక్ష్మీమాతృమండలి, తుని వారి ఆధ్వర్యమున, గణపతి ఉత్సవ సందర్భముగా పట్టణమున ప్రతి ఇంటియందు ఒక గంట కాలము హనుమత్ మంత్రపారాయణము, స్వామీజీ భజనలు 40 రోజులపాటు నిర్వహించబడినవి. ఈ మండల దీక్ష పూర్తి అయిన సందర్భమున సామూహిక అనఘాష్టమీ వ్రతమును నిర్వహించిరి. అనంతరము 4.11.2010 న స్థానిక సత్యసాయి మందిరమున 70 మంది భక్తులచే హనుమత్‌వ్రతము నిర్వహించిరి. ఈ సందర్భముగా చిన్నారులు వివిధ గురుమూర్తుల వేషధారణలతో భక్తులనలరించిరి. 100 మందికి అన్నదానము గావించిరి.

శ్రీమతి గుండ్లపెల్లి సర్వమ్మ గారి భర్త

**శ్రీ గుండ్లపెల్లి లక్ష్మీపతి గారు**

27.09.2010 సోమవారం కరీంనగర్ లో స్వర్గస్థులైనారు.

**శ్రీగురుదేవుల కృపవల్ల వీరి ఆత్మకు శాంతి చేకూరి, ఉత్తమసద్గతి లభించుగాక!**

జయగురుదత్త శ్రీగురుదత్త

# దత్తజయంతి శుభాకాంక్షలు



**అనసూయ, అత్రినందనుడు, ఆదిగురువు అయిన**

**శ్రీదత్తాత్రేయ స్వామివారి జయంతి సందర్భమున,**

**దత్తగురు పరంపరయందు అవతరించిన**

**శ్రీదత్తస్వరూపులు, అవధూత దత్తపీఠాధిపతులు, సద్గురుదేవులు**

**శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారికి శుభాకాంక్షలు**

**తెలియజేస్తూ-**


సదా దత్త సేవలో-

**SDHS వాలంటీర్:**

**పేచర వేణుగోపాలరావు,**

**తండ్రి: జలపతిరావు,**

**వరదవెల్లి గ్రామం, బోయినపల్లిమండలం,**

**వేములవాడ తాలుకా, కరీంనగర్ జిల్లా.**

**Mobile: 9490993153**



# అనుభవములు

## - ఒక భక్తుని కథ

తూర్పుగోదావరిజిల్లా ముమ్మిడివరం వాస్తవ్యులు ప్రముఖ బుర్రకథా కళాకారులు నిట్టల శతృఘ్నరావు (దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు) గురుపౌర్ణమి రోజున గురువుగారి పాదాలలో ఐక్యమయ్యారు. వీరు 1974వ సంవత్సరంలో మద్రాసులో శ్రీ N.T రామారావు గారిని వీరి గ్రామం తీసుకువెళ్ళడానికని వచ్చి వారి ఇంటర్వ్యూ దొరకక చాలా ఇబ్బంది పడుతుండగా, శ్రీస్వామీజీ భక్తులు శ్రీ చంద్రరావుగారి యింటి వద్ద ఉన్న శ్రీస్వామీజీ వారి ఫోటో చూసి తనకు శ్రీ N.T రామారావు గారి ఇంటర్వ్యూ దక్కి ఆయన వారి ఊరు వస్తే శ్రీస్వామీజీ వారి జీవితచరిత్ర బుర్రకథగా వ్రాస్తానని నమస్కారం చేసుకున్నారు. వెంటనే ఆ మరునాడు తెల్లవారుఝామున స్వయంగా శ్రీ N.T రామారావు గారు ఫోన్ చేసి వీరి గ్రామం వస్తానని చెప్పారు. అప్పుడు శ్రీస్వామీజీ వారి జీవితచరిత్ర వ్రాసి మద్రాస్‌లో చంద్రరావుగారి ఇంటి వద్ద శ్రీస్వామీజీ సమక్షంలో పిల్లలచే బుర్ర కథ చెప్పించారు.

అప్పటి నుండి శ్రీస్వామీజీవారి పాదసేవలో నిమగ్నమై, అనేక కార్యక్రమాలు చేసారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ధర్మప్రచార పరిషత్ తరఫున శ్రీకాకుళం జిల్లాలో అనేక కార్యక్రమాలు చేసారు. ఇప్పటి వరకూ 6,500 బుర్రకథలుగా శ్రీస్వామీజీ వారి చరిత్ర గానం చేశారు. వీరి సేవలు గుర్తించిన స్వామీజీవారు వీరిని దత్తపీఠ ఆస్థానవిద్వాన్ అవార్డును 1998 వ సం॥ లో అనుగ్రహించారు.

ఆంధ్రప్రదేశ్‌లో వీరు, వీరి సతీమణి లక్ష్మీకాంతమ్మ మరియు కుమారుడు రమేష్‌కుమార్‌లతో కలిసి దత్తప్రచారాన్ని నిర్విరామంగా నిర్వర్తించారు. వీరు

చెప్పే దత్తవతారగాధలు, శ్రీస్వామీజీ వారి చరిత్ర, జయలక్ష్మిమాత చరిత్రలను వారే రచించుకొని చెప్పేవారు. వీరు చెప్పిన చరిత్రలను దత్తపీఠం తరుపున ఆడియోక్యాసెట్‌లుగా శ్రీస్వామీజీవారు రిలీజ్ చేయించినారు. వీరు గత 38 సంవత్సరాలు నుండి శ్రీస్వామీజీవారి సేవలో ఉండి శ్రీస్వామీజీ వారి చరిత్రలను పల్లె పల్లెలో గానం చేసి తరించారు.

వీరి అపార గురుభక్తికి నిదర్శనంగా గురుపౌర్ణమి రోజు ఉదయాన జయగురుదత్త అని నామం చెప్తూ శ్రీస్వామీజీ పాదాలలో ఐక్యమయ్యారు. గురుభక్తికి ఈ భక్తుని కథే ఒక నిదర్శనం.


శ్రీమతి & శ్రీ కోపల్లె మురళీనాథ్ గార్ల కనిష్ఠ పుత్రిక

**చి॥ల॥సౌ॥ సుధ**

శ్రీమతి మంథా సుందరి గారి కనిష్ఠ పుత్రుడు

**చి॥ దినకర్ ల**

వివాహం 21.10.2010 గురువారం హైదరాబాదులో జరిగింది.

**ఈ నూతన వధూవరులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

**దత్తజయంతి సందర్భంగా శ్రీస్వామీజీవారి ఆశీస్సులు అర్థిస్తూ...**

**శ్రీమతి సీతాలక్ష్మి & శ్రీ పారెపాక లక్ష్మీమోహనరావు**

మరియు కుటుంబసభ్యులు, మైసూరు

**దత్తజయంతి సందర్భంగా శ్రీస్వామీజీవారి ఆశీస్సులు అర్థిస్తూ...**

**అన్నవరపు పాండురంగారావు**, Proprietor

Sree Panduranga Plywoods, Glasses & General Traders

Challapalli - 521 126, Cell: 98850 59511

శ్రీమతి & శ్రీ పేర సిద్ధరాములు గార్ల ప్రథమ పుత్రుడు

**చి॥ నవీన్‌కుమార్**

కీ॥శే॥ బలష్టి కాశిరాం గారి కనిష్ఠ పుత్రిక

**చి॥ల॥సౌ॥ జ్యోత్స్న (సుమ) ల**

వివాహం 15.11.2010 సోమవారం యెల్లారెడ్డిలో జరిగింది.

**ఈ నూతన వధూవరులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించుగాక!**

# గాణగాపుర దత్తక్షేత్ర ప్రతిష్ఠా ఆహ్వానము





ప్రత్యక్ష దత్తావతార స్వరూపులైన

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి

అమృత హస్తాలమీదుగా

అలనాటి శ్రీనృసింహసరస్వతి ప్రతిష్ఠాపిత గాణగాపుర క్షేత్రంలో

16 అడుగుల ఏకశిలాఖండంలో

విశ్వరూప దత్తాత్రేయ ప్రతిష్ఠామహోత్సవం

13.2.2011 ఆదివారం నాడు ఉదయం

నిర్వహింపబడగలదు. సహజసిద్ధ సిద్ధక్షేత్రమైన ఇలాంటి మహాక్షేత్రంలో

దేవతా ప్రతిష్ఠా దర్శనము, ఈ సమయంలో చేసే అనుష్ఠాన దానాదులు,

అనంత ఫల ప్రదాలని శాస్త్ర నిర్ణయం. ఈ అపూర్వ సన్నివేశాన్ని

సద్భక్తులందరూ సద్వినియోగం చేసుకోగలరు.

ఇట్లు,


విశ్వరూప దత్తక్షేత్రం, అవధూత దత్తపీఠం- గాణగాపురం శాఖ,

గాణగాపురం- 585212, అఫ్జల్‌పూర్ తాలూకు, గుల్బర్గ జిల్లా, కర్ణాటక.

ఆఫీస్: (08470) 274429,వసతి/వివరములకు:(పండు) 08970009639, 09845324140,

హైదరాబాద్: (రాజు,బి.డి.ఎల్) 09440344803

# పురాతన భారతీయ విజ్ఞానశాస్త్ర శాఖలు

(I-SERVE వారి పరిశోధనలు)

## శుల్బానంతర గణితం

కాలం గడుస్తున్న కొద్దీ భారతీయ గణిత శాస్త్రంలో కూడా ఏశాఖకాశాఖ విడిపోయి, వేరు వేరు పేర్లతో వ్యవహారం మొదలైంది. అంటే, ఆయా శాఖలు విడివిడిగా విస్తరణ పొందటంవల్లనే, వాటికి విడివిడి గుర్తింపు లభించిందన్నమాట. ఉదాహరణకు.

1. అంక గణితానికి ఆనాటి ఒక పేరు "పాటీ గణితం". పాటీ అంటే పలక మీద పిల్లలు నేర్చుకునే గణితం. కనుక, అది పాటీ గణితం. (ఆరోజుల్లో కాగితం లేదు.)

2. దానికి మరో పేరు "ధూళికర్మ" పలకలు కూడా దొరకని చోట, నేలమీద బూడిద పోసి, దానిమీద వేళ్లతో అంకెలు గీయించేవాళ్లు. అవసరమైతే ఆ బూడిదను కదిలించెయ్యటం ద్వారా అంకెలను చెరిపి మళ్లీ రాసేవారు. అలాంటి లేఖనంతో చేసే గణితం "ధూళికర్మ". ఇది కొన్ని మారుమూల ప్రాంతాలలో మాత్రమే వుండేది.

3. దీనికి 9 భాగాలు వుంటాయి. అవి –

   1. సంకలితం (Additions)
   2. వ్యుత్కలితం లేక వ్యకలితం (Subtraction)
   3. గుణం (Multiplication)
   4. భాగాహారం (Division)
   5. వర్గం (Square)
   6. వర్గమూలం (Square root)
   7. ఘనం (Cube)
   8. ఘనమూలం (Cube root)
   9. గణిత ఫలితాలను సరిచూసుకునే విధానాలు Checking

శుల్బానంతరం 10వ శతాబ్దిదాకా వచ్చిన గణిత గ్రంథాలలో క్రమక్రమంగా ఈ విభాగం విస్పష్టమైంది. ఈ ప్రాంతానికి వెనుక ముందుగానే (8,9,10 శతాబ్దులలో) ఈ విజ్ఞానం క్రమంగా అరబ్ దేశాలకు కూడా వ్యాపించింది. అలికిడి నుంచి యూరపు దేశాలకు చేరింది.

**భిన్నాంకములు** (Fractions)

గణితశాస్త్ర వికాసంలో భిన్నాంకాల ఆవిర్భావము ఒక గొప్ప ఘట్టం. 1,2,3, వంటి పూర్ణాంకాల వినియోగం నుంచీ 1/2, 1/3 వంటి భిన్నాల ఆవిర్భావం సులభంగా జరిగే పని కాదు.

కానీ, వేదాలలో అనేక చోట్ల భిన్నాంకాల ప్రసక్తి విస్పష్టంగా వుంది. ఉదాహరణకు – శతపథ బ్రాహ్మణంలో ఒకచోట దిన ప్రమాణాన్ని (Length of a day) విభాగాలు చెయ్యవలసి వచ్చింది. ఆ సందర్భంలో శతపథ బ్రాహ్మణంలో భిన్నాంకాలనే వాడింది. శుల్బ సూత్రాల కాలానికి ఈ భిన్నాంకాలను అంకెలుగా వ్యక్తం చేసే విధానాలు వుండేవి అనటానికి నిదర్శనాలున్నాయి. వారి సంకేతం ఈనాటిలాగా 1/2 అని లేదు. కానీ, దీనికి దగ్గరగానే వుండేది. ఆ సంకేతంతో వారు భిన్నాంకాలకు ఇందాక చెప్పుకున్న సంకలన, వ్యవకలనాది అష్టవిధ వ్యవహారాలను (8 Kinds of operations ) చేసేవారు. భిన్నాలతో సంకలనాదులు చెయ్యాలంటే, భాజకాల (Denominators) యొక్క L.C.M తెలియాలి. అది తెలిసిన దాఖలాలు స్పష్టంగా వున్నాయి.

500 బిసి. నుంచి 150 బి.సి. వరకు గల గణిత గ్రంథాలలో Permutations & Combinations కి కావలసిన సూత్రాలను చెప్పారు. వాటిని వారు "వికల్పాలు" అని పిలిచారు. ఆ తరువాత 850 ఎడి లో మహావీరుడు, 1089 ఎడి లో హేమచంద్రసూరి, వీటికి మరింత నవీనమైన సూత్రాల నందించారు.

బి సి 3వ శతాబ్దిలోని పింగళుడి ఛందస్సూత్రాలలో "మేరుప్రస్తారము" అనే ప్రసక్తి వచ్చింది. దీన్నే చాలా శతాబ్దాల తరువాత పాశ్చాత్యులలో Pascal అనే వైజ్ఞానికుడు కనిపెట్టి, తన పేరు మీద Pascal's Triangle అని పేరు పెట్టుకున్నాడు. వీరిద్దరూ ఉపయోగించిన సూత్రం ఒకటే – ${}^{n+1}c_r = {}^{n}c_r + {}^{n}c_{r-1}$

## I-SERVE వారు మద్రాసులో నిర్వహించిన జాతీయ సదస్సు - సంక్షిప్త నివేదిక

I-SERVE మరియు శ్రీ గణపతి సచ్చిదానంద ట్రస్టు - మద్రాసు శాఖవారి సంయుక్త ఆధ్వర్యంలో "Vedic Science - Contemporary Relevance" అనే అంశం మీద ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహింపబడింది. చెన్నైలోని ఎల్డామ్స్ రోడ్డులో గల "తత్వాలోక" హాలులో అక్టోబరు 2, 2010వ తేదీన ఈ సదస్సు నిర్వహించబడింది. ఈ సదస్సుకు మద్రాసు IIT, అన్నాదురై యూనివర్సిటీ మద్రాసు యూనివర్సిటీ వంటి సంస్థల నుంచీ వైజ్ఞానికులు, ఇతర పురప్రముఖులు, వెరసి 150కి పైగా సదస్యులు విచ్చేశారు. సభనలంకరించిన ప్రముఖులలో ప్రముఖాంధ్ర పత్రిక సంపాదకులు శ్రీ గోటేటి రామారావు, శ్రీమతి లక్ష్మి ప్రసాద్ IPS, శ్రీ ఎస్. చంద్రశేఖర్, మొదలైన వారున్నారు. దత్త పీఠ ఉత్తరాధికారి పరమ పూజ్య శ్రీ దత్త విజయానందతీర్థ స్వామీజీవారు జ్యోతి ప్రజ్వలనం చేసి సదస్సును ప్రారంభించారు. ప్రతిష్ఠాత్మకమైన వివిధ వైజ్ఞానిక సంస్థల నుండి విచ్చేసిన శాస్త్రవేత్తలందరికీ తమ దివ్యాశీస్సులను అందించారు. శ్రీస్వామీజీవారు తమ ప్రసంగంలో వేదవాఙ్మయాన్ని శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన Construction Development Council, ఛైర్మన్ ఎమరైటస్, మరియు Infrastructure Consultants (Pvt) Ltd, ఛైర్మన్ అయిన పద్మభూషణ్ శ్రీ జి.వి రామకృష్ణ ప్రసంగిస్తూ, పాశ్చాత్య దేశాలవారు అంగీకరించినా, అంగీకరించకపోయినా, వేదాలు విజ్ఞానానికి మూలవనరులని, వాటిని భావితరాలవారికి అందిచడం కోసం యువత కృషిచేయాలని, సూచించారు.

కంచి సంస్కృత విశ్వవిద్యాలయంలో పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి. శివకుమార్ తమ ప్రసంగంలో సంస్కృతం నేర్చుకోవాల్సిన అవశ్యకతను వివరిస్తూ, అది నేర్చుకున్నందువల్ల మన విజ్ఞాన భాండాగారాన్ని పదిలంగా

కాపాడుకోగలమని అన్నారు. మన వేద విజ్ఞానం ప్రపంచంలో విశిష్టమైనదీ, జగత్ప్రసిద్ధి పొందింది అన్నారు. కంచి సంస్కృత విశ్వవిద్యాలయం వారు "Internet" ద్వారా సంస్కృతం నేర్చుకునే కోర్సులను ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించినప్పుడు, భారతీయులకన్నా పాశ్చాత్య దేశాలవారే ఎక్కువ ఉత్సాహాన్ని చూపారని అన్నారు. సంస్కృతం నేర్చుకోడానికి వయోభేదం లేదనీ, మేధావులూ, శాస్త్రవేత్తలూ, సంస్కృతం నేర్చుకుంటే వేద విజ్ఞానంపై మరిన్ని పరిశోధనలు సమర్థవంతంగా చెయ్యగలరని, కనుక అటువంటి ప్రతిభావంతులు ముందుకు రావాలనీ, కోరారు.

సదస్సు ప్రారంభంలో ఐ-సర్వ్ ఛైర్మన్, బ్రహ్మశ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి ప్రసంగిస్తూ వేద విజ్ఞానాన్ని వెలికి తీయడంలో చేసే పరిశోధనలలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విపులంగా ప్రస్తావించారు. ఐ-సర్వ్ నిర్వహిస్తున్న ఈ పరిశోధనలలో చెన్నైలోని మేధావులు చురుకుగా పాల్గొనాలని, తద్వారా వేదవిజ్ఞానానికి సంబంధించిన అనేక సాంకేతిక రహస్యాలను వెలికితీయవచ్చునని అన్నారు.

అటు తరువాత జరిగిన సాంకేతిక విభాగ సదస్సులో (సెషనులో) మొదటిదానికి ప్రొఫెసర్. కె. రమేష్ FNAE అధ్యక్షులుగా విచ్చేశారు. ఈ విభాగంలో- మున్ముందుగా Centre for policy studies అధ్యక్షులు డా. ఎమ్.డి. శ్రీనివాస్ గారు "విజ్ఞానశాస్త్రం పై భారతీయుల దృష్టి"- అనే అంశంపై చేసిన ప్రసంగం అత్యున్నతమైన వైజ్ఞానిక విలువలతో కూడి సదస్యులను విశేషంగా అలరించి ఆకట్టుకుంది.

భోజన విరామం తరువాత జరిగిన రెండవ సాంకేతిక విభాగం- "Executive, psycho spectrum environmental research" ఛైర్మన్ డా॥ వి.వి. సుబ్రహ్మణియన్ (వా.వే.సు గా వీరు సుప్రసిద్ధులు) నేతృత్వంలో జరిగింది. మద్రాసు విశ్వవిద్యాలయం, భౌతిక శాస్త్ర విభాగపు అధిపతి డా॥ఎమ్.ఎస్. శ్రీరాం "ఆర్యభటుడు - ఆయన యోగదానము" అనే అంశంపై విశిష్టమైన పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ముంబై ఐఐటిలో హ్యూమానిటీస్

డిపార్ట్‌మెంటుకు చెందిన డా॥ కె. రామసుబ్రహ్మణియన్ "భారతదేశంలో గణితశాస్త్ర ఆవిర్భావ వికాసాలు" అనే అంశంపై శాస్త్రీయ పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఆయన వివరించిన ఖగోళ శాస్త్ర, గణితశాస్త్ర పరిశోధనా విషయాలను విన్న సదస్యులు విశేషంగా స్పందించారు.

ఐ-సర్వ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, డా॥ ఎస్. శివరాంబాబు ఋగ్వేదానికి సంబంధించిన అనేక కాస్మలాజికల్ సిద్ధాంతాలను వివరిస్తూ Big Bang Theoryకి వున్న దోషాలు మన ఋగ్వేద సిద్ధాంతాలకు లేవని తెల్పారు.

ఐ-సర్వ్ పరిశోధనా విభాగానికి చెందిన శాస్త్రవేత్త, నాగర్‌కోయిల్ నివాసి, శ్రీ ఎమ్. రాజేంద్రన్, క్రీ.పూ. 2వ శతాబ్దానికి చెందిన ఛందశ్శాస్త్ర రచయిత పింగళమహర్షి రచించిన గ్రంథంలోని గణిత శాస్త్రంలోగల "Binary Algarithms" అనే అంశంపై ప్రసంగించారు. చివరగా ప్రొ. వావేసు గారు ఈ విభాగంలోని అన్ని విషయాలను సంగ్రహంగా ప్రస్తావిస్తూ ఐ-సర్వ్, హైదరాబాదువారు చేస్తున్న కృషిని అభినందిస్తూ, విశిష్టమైన ప్రసంగాన్ని చేశారు.

సదస్సు ముగింపు కార్యక్రమంగా ప్రొ.కె.వి.కృష్ణమూర్తి, చైర్మన్ , ఐ-సర్వ్ ఈనాటి సదస్సు చెన్నైలో ఈ తరహా పరిశోధనలకి ప్రారంభం కావాలనీ, ఇక్కడి మేధావులు ఈ దిశలో మరిన్ని పరిశోధనలను దశలవారీగా జరపాలనీ, ప్రతిపాదించగా ప్రముఖ వైజ్ఞానిక సంస్థలనుండి విచ్చేసిన శాస్త్రవేత్తలనుండి సానుకూల స్పందన లభించింది.

SGS ఆశ్రమం చెన్నై శాఖకు చెందిన Executive Trustee శ్రీ ఎస్. జయరామన్ సదస్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ వందన సమర్పణ చేశారు. సాయంత్రం 5.30 గం.కి జాతీయ గీతాలాపనతో నాటి సదస్సును ముగించారు.

సెరిదింటకుణ్ణి వాస్తవ్యులు, లేటు పొట్లూరి శ్రీరామ లక్ష్మీనరసింహారావు గారి ధర్మపత్ని
**శ్రీమతి లక్ష్మీవిలాసమనోహరం గారు**
22.09.2010 బుధవారం స్వర్గస్థులైనారు.
**శ్రీగురుదేవుల కృపవల్ల వీరి ఆత్మకు శాంతి చేకూరి, ఉత్తమసద్గతి లభించుగాక!**

## I-SERVE తిరుపతి శాఖలో ప్రతిమాస శాస్త్రార్థ సభలు

శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి దివ్యాశీస్సులతో వారి దివ్యాజ్ఞ మేరకు నడుస్తున్న ఐ-సర్వ్ సంస్థ గత జూలై నెలలో తిరుపతినగరంలో ఒక శాఖను ప్రారంభించిన సంగతి, గత సెప్టెంబరు నెలలో ఒక పెద్ద సెమినార్ జరిపిన సంగతి మీకు తెలిసినవే. తిరుపతి నగరంలో వున్న ఏడు విశ్వ విద్యాలయాలలోనూ, ఎందరో సంస్కృత శాస్త్ర పండితులు, విజ్ఞాన శాస్త్రవేత్తలు, వున్న దృష్ట్యా, వీరి ద్వారా తమ పరిశోధనా కార్యక్రమాలను విస్తరింపచేయటం కోసం, ఇక్కడ సంస్కృతంలో సాంప్రదాయక శాస్త్ర చర్చా సమావేశాలు, వేద విజ్ఞాన శాఖల చర్చా సమావేశాలు, గూడా ప్రతి నెలా నిర్వహించి, మేధామథనం జరిపించాలని ఐ-సర్వ్ సంకల్పించింది. అందులో భాగంగా 25.11.2010 (గురువారం) నుండి సంస్కృతంలో "ప్రతిమాస సాంప్రదాయిక శాస్త్ర చర్చ"లను ప్రారంభించింది. ఈ ప్రారంభ సభకు 15 మంది సంస్కృత శాస్త్ర పండితులు విచ్చేశారు. ఈ శాస్త్రాలలో ఈ సంఖ్యే గొప్ప. మన సనాతన శాస్త్రాల పరిస్థితి అలా వుంది. ఈ ప్రతిమాస సంస్కృత చర్చలు సనాతన శాస్త్ర ప్రవృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయని సభకు విచ్చేసిన ప్రముఖ పండితులు శుభాకాంక్షలందించారు. ఈ సభల్లో జరిగే ప్రతిమాస చర్చల సారాంశాన్ని ప్రతి నెల ఐ-సర్వ్‌వారి వెబ్‌సైట్‌లో (www.serveveda.org) సంగ్రహంగానైనా ప్రకటించాలని గూడా ఆ సమావేశంలో తీర్మానించటం జరిగింది. దానికి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇలాగే వేదాంతర్గత విజ్ఞాన శాస్త్ర శాఖల గురించిన ప్రతిమాస చర్చా సమావేశాలు గూడా త్వరలో తిరుపతిలో ప్రారంభం కానున్నాయని ఐ-సర్వ్ అధ్యక్షులు శ్రీకుప్పావేంకట కృష్ణమూర్తి ప్రకటించారు.

**భక్తిమాల ఎన్వలప్ పై మీ చందా ముగింపు తేదీ వున్నది. దీన్ని గురించి వేరే నోటీసు రాదు. కనుక దయచేసి ప్రతినెలా ఎన్వలప్‌ను గమనించి మీ చందా ముగిసేందుకు తగినంత ముందుగానే మళ్లీ చందా కట్టి, భక్తిమాల అభివృద్ధికి సహకరించ ప్రార్థన. అడ్రసు మారినచో పాత, క్రొత్త అడ్రసులను తెలుపుతూ, ఒక పోస్టుకార్డు వ్రాసినచో భక్తిమాల నిరంతరంగా మీకు చేరుతుంది.**

## శ్రీస్వామీజీ వారి పర్యటన - తాత్కాలిక పట్టిక

శ్రీస్వామీజీవారి కార్యక్రమములలో అనుకోని మార్పులు జరుగవచ్చు.
వివరాలకు ఆశ్రమ కార్యాలయమును సంప్రదించ మనవి.
**మైసూరు : 0821-2486486**

| | |
|---|---|
| 29 డిశంబర్ 2010 | - విజయవాడ |
| 30 డిశంబర్ 2010 | - జ్ఞా.నా.భ.యోగ సమ్మేళనము |
| 1 జనవరి 2010 | - మహాదర్శనము |
| 4 జనవరి 2010 | - నూజివీడు |
| 5 జనవరి 2010 | - ఏలూరు |
| 6 జనవరి 2010 | - బాదంపూడి |
| 7 జనవరి 2010 | - రాజమండ్రి |
| 8 జనవరి 2010 | -పిఠాపురం |
| 9 జనవరి 2010 | - శ్రీకాకుళం |
| 12 జనవరి 2010 | - రాజమండ్రి |
| 13 జనవరి 2010 | - భీమవరం |
| 17 జనవరి 2010 | - కైకలూరు |
| 19 జనవరి 2010 | - ఇండోర్ |
| 23 జనవరి 2010 | - ఆకివీడు |
| 25 జనవరి 2010 | - గుంటూరు |
| 28 జనవరి 2010 | - నెల్లూరు |
| 31 జనవరి 2010 | - కడప |

## ఫొటోల వివరములు

3) సచ్చిదానంద వాద్యవైభవ వాద్యబృందమును ఆశీర్వదిస్తున్న శ్రీస్వామీజీ.

4) పౌండరిక రంగస్థలమున ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవ కమనీయ దృశ్యము.

5) అతిరుద్రయాగ శాలయందు ఏర్పాటు చేసిన ప్రధాన కలశ వేదిక మనోహర దృశ్యము.

6) అతిరుద్రయాగ సమయమున పవిత్ర కార్తీక సోమవారమునాడు శ్రీస్వామీజీ వారిని రుద్రాక్షలతో అర్చనగావిస్తున్న బాలస్వామీజీవారు.

# ఎస్‌జిఎస్ దత్తసేవ

ఎస్‌జిఎస్ దత్తసేవకు స్వాగతం.

పూజ్య శ్రీ స్వామీజీ వారి మార్గదర్శనంలో అవధూత దత్తపీఠం గత నాలుగు దశాబ్దాలుగా అనేక ధార్మిక, దైవిక, సాంస్కృతిక, సమాజసేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయం మీకందరికీ తెలుసు. సామాజిక సేవలో భాగంగా దత్తపీఠం ఆధ్వర్యంలో హైదరాబాదులో నిరాధార వృద్ధ మహిళల కొరకు 'అమ్మవొడి' అనే సంస్థ, బెంగళూరులో మూగ చెవిటి పిల్లల శిక్షణకై వాగ్దేవి విద్యాసంస్థ, ఇంకా అనేక ఆశ్రమ శాఖలలో ఉచిత ఆస్పత్రులు, వైద్య శిబిరాలు, వృద్ధాశ్రమాలు, పౌర్ణమి అన్నదానాలు నిర్వహించబడుతున్నాయి.

**పరమపూజ్య శ్రీ స్వామీజీవారు ది.09.09.09న 09.09.09 గంటలకు** కావేరీతీర పవిత్ర క్షేత్రమున **ఎస్ జి ఎస్ దత్తసేవ** అనే పవిత్ర సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు కేవలం 5 రూపాయలు దానము చేయుట ద్వారా మీరు ఈ పథకంలో సభ్యులుగా చేరి, దత్తపీఠం నిర్వహిస్తున్న వివిధ బృహత్ సేవా కార్యక్రమాలకు మీవంతు సహాయాన్ని అందించవచ్చు. కనుక మీ బంధువులను, మిత్రులను కూడా దీనికై ప్రోత్సహించవలసినదిగా కోరుతున్నాము.

ఎస్‌జిఎస్ దత్తసేవ వార్షిక సభ్యులకు సంవత్సరానికి ఒకసారి దత్తజయంతి అనంతరం స్వామీజీవారి అనుగ్రహ ప్రసాదం పంపటం జరుగుతుంది. మీరు కోరుకున్నట్లయితే శ్రీ స్వామీజీవారు అప్పుడప్పుడు పంపే ఇమెయిల్ మెసేజ్‌లను కూడా పొందవచ్చు.

రోజుకు రూ. 5 చొప్పున నెలసరి మొత్తం రూ.150 గాని, 3నెలలకు రూ.450 గాని, 6 నెలలకు రూ. 900 గాని, సంవత్సరానికి రూ. 1800 గాని మీరు ఒకేసారి నగదు, డి.డి లేదా చెక్కు రూపంలో చెల్లించవచ్చు. వెబ్‌సైట్ ద్వారాను, నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయుట ద్వారాను, డెబిట్ లేదా క్రెడిట్ కార్డుల ద్వారా కూడా చెల్లించే సదుపాయం వుంది.

**మీ వివరాలను ప్రక్కపేజీలోని దరఖాస్తు ఫారంలో** నింపి, డి.డిలు, చెక్కులు **"అవధూత దత్త పీఠం ట్రస్ట్ (ఎస్‌జిఎస్ దత్తసేవ)"** పేరు మీద మైసూరులో చెల్లించే విధంగా తీసుకుని,-ఎస్‌జిఎస్ దత్తసేవ కార్యాలయం, శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమం, దత్తనగర్, మైసూరు అనే చిరునామాకు పంపాలి. ఇతర వివరాలకు sgsdattaseva.org ను చూడండి.

# ఎస్‌జిఎస్
# దత్తసేవ

దాత ఫోటో

1. దాత పూర్తి పేరు : ________________

2. చిరునామా : ________________

3. ఫోన్ నంబరు : ________________

4. ఇమెయిల్ : ________________

5. పుట్టిన తేదీ : D D M M Y Y Y Y

6. గోత్రం : ________________

7. నక్షత్రం : ________________

8. విరాళానికి అనువైన వాయిదా పద్ధతి : నెలవారి Rs. 150 3 నెలలకు Rs. 450 6 నెలలకు Rs. 900 సంవత్సరానికి Rs. 1800

అవధూత దత్తపీఠము నిర్వహిస్తున్న దత్తసేవ పథకంలో సభ్యత్వమును స్వచ్ఛందంగా కోరుతున్నాను. ఈ సభ్యత్వము ద్వారా శ్రీసద్గురువుల అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నాను.

తేదీ ________________ సంతకం ________________







**BHAKTI MALA MONTHLY Regd News Paper - No 29690/76 December 2010**

Registered with Dept. Of posts vide Regn. Nos.

KANNADA : KA/SK/MYS-07/2009-11: ENGLISH : KA/SK/MYS-06/2009-11 & TELUGU : KA/SK/MYS-08/2009-11

Licenced to post without Prepayment vide Licence Nos.

KANNADA : WPP-SK-3 : ENGLISH : WPP-SK-1 & TELUGU : WPP-SK-2




Printed and Published by Dr. A.N. Swarnaprasad for
Sri Bhakti Mala Trust, *Mysore* at Lakshmi Narasimha Mudrana
Sri Ganapati Sachchidananda Ashram, *Mysore* - 570 025 (India)